
# మన క్రాంతి

KR TV

ఇది వాస్తవ పత్రిక...

## నేటి మాట

కులం పునాదుల మేడ మేరు ఏమి సాధించలేరు. ఒక జాతిని నిర్మించ లేరు. ఒక నీతిని నిర్మించ లేరు.



-డా.బి.ఆర్.అంబేద్కర్

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి: 01 సంచిక 348 | ఆదివారం 30 నవంబర్ 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 | వెల: 3 రూ/-

## త్వరలో తెలంగాణ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ? నలుగురు మంత్రులకు ఉద్వాసన?




## సీల్డ్ కవర్ సర్పంచ్, కొండారెడ్డిపల్లెలో ఏకగ్రీవ చరిత్ర!




## పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కేటీఆర్ కౌంటర్: 'తెలంగాణ ఉద్యమంలో ఎక్కడున్నావ్?




## కర్ణాటక పవర్ షేరింగ్‌పై 'బ్రేక్‌ఫాస్ట్' దౌత్యం , ఉద్రిక్తతకు తెరపడినట్టేనా?




## తెలంగాణ జాతిపిత కేసీఆర్




## పవన్ కళ్యాణ్‌పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి 'అగ్గిరాజేసే' వ్యాఖ్యలు




## మాదాపూర్‌లో మరోసారి కూల్చివేతలు మైండ్‌స్పేస్ మార్గంలో పేదల షాపులు ధ్వంసం




## వరంగల్‌లో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




## 'ఇకపై మా మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలూ ఉండవు'

### డీకే శివకుమార్‌ను ఉద్దేశించి సిద్ధూ

కర్ణాటక ముఖ్యమంత్రి పీఠంపై నెలకొన్న ఊహాగానాలకు తెరదించే ప్రయత్నంలో భాగంగా.. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య , ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం ఉదయం కలిసి భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన సిద్ధరామయ్య.. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, ఇకముందు కూడా ఉండబోవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు తాము ఈ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొన్నామని సిద్ధరామయ్య తెలిపారు. ఈ భేటీలో ఏ అంశం గురించి ప్రధానంగా చర్చించలేదని.. నెల రోజుల నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే తాము కలిసి సమావేశమయ్యామని చెప్పారు.

బీజేపీ–జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తున్నాయని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. ప్రతిపక్షాల ఈ తప్పుడు ప్రచారాలను తాను, డీకే శివకుమార్ ఉమ్మడిగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 అసెంబ్లీ ఎన్నికలు, స్థానిక ఎన్నికలపైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పని చేస్తామని ప్రకటించారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కర్ణాటక ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం.. ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్ధరామయ్యతో కలిసి పని చేస్తానని హామీ ఇచ్చారు.



"మేము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నాం. హైకమాండ్ ఏం చెప్పినా, దానిని అందరం అనుసరిస్తాం" అని డీకేఎస్ స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్టీ పలు సమస్యలు ఎదుర్కొంటోందని.. రాబోయే 2028 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి పదవికి సంబంధించిన నాయకత్వం విషయంలోనూ హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ప్రచారం జరుగుతోంది. రెండున్నరేళ్ల తర్వాత డీకే శివకుమార్‌కు సీఎం బాధ్యతలు అప్పగించేలా గతంలో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతున్నా.. పార్టీ మాత్రం దీనిని పదే పదే ఖండిస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలోనే పార్టీ హైకమాండ్ సూచనల మేరకు నేటి భేటీ జరగడం, ఇద్దరు నేతలు ఐక్యతా సందేశాన్ని ఇవ్వడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది.

## 'ఆ స్లీపర్ బస్సులు ఇక వాడొద్దు, పక్కన పెట్టేయండి'

### రాష్ట్రాలకు NHRC కీలక ఆదేశాలు




దేశంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల వరుసగా జరుగుతున్న ఘోర బస్సు ప్రమాదాల నేపథ్యంలో ప్రయాణికుల భద్రతపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న స్లీపర్ కోచ్ బస్సులను తక్షణమే రోడ్లపై నుంచి పక్కన పెట్టేయాలని ఎన్‌హెచ్ఆర్సీ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది.

దూర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేట్ స్లీపర్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయని.. దీనివల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కర్నూలు, సౌదీ బస్సు ప్రమాదాల వంటి ఘటనల కారణంగా ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణం ఎంత వరకు సురక్షితమనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. దీనిపై పలువురు ఫిర్యాదు చేయడంతో మానవ హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది.

# రాజీవ్ గాంధీపై చేయి వేస్తే నీ తాట తీస్తాం.. జాగ్రత్త!

## కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ హెచ్చరిక

- కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్ఎల్‌సీ దయాకర్ తీవ్ర ఫైర్
- 'కేసీఆర్ దీక్ష డ్రామా అందరికీ తెలుసు' - దయాకర్ విమర్శ
- అమరవీరుల త్యాగాలను బీఆర్ఎస్ ఎందుకు మరచిందో?
- మహేష్ గౌడ్ మాటకు కేటీఆర్ టెన్షన్: కాంగ్రెస్ వ్యాఖ్య
- సోనియా వల్లే తెలంగాణ... తర్వాత అవమానాలా?
- 'తెలంగాణ నిజమైన బిడ్డ రేవంత్ రెడ్డి' - దయాకర్ ప్రశంస

కేసీఆర్ దీక్ష వల్లే తెలంగాణ వచ్చిందని బీఆర్ఎస్ చెప్పుకుంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మండిపడ్డారు. ఇవాళ సీఎల్పీ మీడియా సెంటర్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. 'కేసీఆర్ దీక్ష ఎలా చేశాడో, ఎలాంటి ఫ్లూయిడ్స్ తీసుకున్నాడో అందరికీ తెలుసు. 1200 మంది అమరవీరుల త్యాగాల కంటే కేసీఆర్ దీక్ష పెద్దదా?' అని ప్రశ్నించారు. శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాన్ రెడ్డి, కిష్టయ్య వంటి ఉద్యమ వీరుల త్యాగాలను బీఆర్ఎస్ ఎందుకు గుర్తు చేసుకోదని ధ్వజమెత్తారు.

మిగతా 2 లో



## ఓయూ డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ కలకలం, మలక్‌పేట కాలేజీలో పుస్తకాలు, ఫోన్లతో కాపీయింగ్




ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) ఆధ్వర్యంలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ వ్యవహారం కలకలం సృష్టించింది. నగరంలోని మలక్‌పేటలో ఉన్న ఒక ప్రైవేట్ కళాశాల పరీక్షా కేంద్రంలో విద్యార్థులు పుస్తకాలు, సెల్ ఫోన్లను ఉపయోగించి గుంపుగా కాపీ కొడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. కాపీయింగ్ జరుగుతున్నట్టుగా సమాచారం అందుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం కళాశాలకు వస్తున్నట్టు తెలుసుకోవడంతో, కాపీ కొడుతున్న విద్యార్థులు హడావిడిగా తాము దాచుకున్న పుస్తకాలు, కాపీ స్లిప్‌లను తరగతి గది కిటికీల గుండా బయటకు విసిరేశారు.

## నన్ను మాత్రం మోసం చేయలేదు, నన్నే అంటిపెట్టుకొని ఉన్నారని అంటుంది




నందమూరి బాలకృష్ణ సినిమాలతో, రాజకీయాలతో ఎంత బిజీగా ఉన్నా, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకోవడానికి వెనుకాడరు. ఇటీవల ఒక కార్యక్రమంలో, ఆయన తన భార్య వసుంధరా దేవి తో తమ బంధం గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రేక్షకులను నవ్వించాయి. బాలకృష్ణ మాట్లాడుతూ...

## మేడారం జాతరకు జాతీయ హోదా సాధ్యం కాదు : కిషన్ రెడ్డి




మేడారం జాతరకు జాతీయ హోదా సాధ్యం కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఏ ఉత్సవాలకు జాతీయ హోదా లేదన్నారు. శనివారం వరంగల్ జిల్లాలో కిషన్ రెడ్డి పర్యటించారు. వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఈ సందర్భంగా పరిశీలించారు. ఇందుకోసం ఆయన వందేభారత్ రైలులో హైదరాబాద్ నుంచి వరంగల్ చేరుకున్నారు. రేల్వే స్టేషన్ క్యాంటీన్?లో చాయ్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నగరంలోని భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడారం జాతరపై కీలక వ్యాఖ్యలు చేశారు.

మేడారం జాతర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కిషన్ రెడ్డి చెప్పారు. వరంగల్ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక శ్రద్ధతో ఉందని చెప్పారు. రామప్ప, వేయిస్థంబాల గుడికి పూర్వవైభవం వచ్చిందన్నారు. భక్తుల అవసరాలకు తగట్టు వసతులు సమకూరుస్తామని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వ సహకారం కోసం లేఖ రాస్తే స్పందన లేదన్నారు.

## విద్యుత్‌తోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు




రాష్ట్ర విభజన తర్వాత విద్యుత్ డిమాండ్ పెరిగిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇవాళ ఆయన విద్యుత్ రంగంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సీఎంతో పాటు కేబినెట్‌లోని సహచరులంతా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తెలంగాణను 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని చూస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒకేసారి 10 శాతం విద్యుత్ డిమాండ్ పెరిగిందని తెలిపారు. 2047 వరకు లక్ష మెగావాట్లకు పైగా విద్యుత్ అవసరం అవుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం మన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 27,769 మెగావాట్లుగా ఉందన్నారు. హైదరాబాద్ భవిష్యత్తులో గ్లోబల్ హబ్‌గా మారబోతున్న దృష్ట్యా విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించామన్నారు.

మన క్రాంతి KR TV ఇది వాస్తవ పత్రిక...
ఆదివారం 30 నవంబర్ 2025

## త్వరలో తెలంగాణ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ? నలుగురు మంత్రులకు ఉద్వాసన?

హైదరాబాద్ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గంలో త్వరలో భారీ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. మరో వారం, పది రోజుల్లో ఈ మార్పులు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

తాజా ఊహాగానాల ప్రకారం, కేబినెట్ నుంచి నలుగురు లేదా ఐదుగురు మంత్రులను తప్పించే అవకాశం ఉంది. వీరిలో మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించడం ద్వారా పాలనపై మరింత పట్టు సాధించాలని, అలాగే సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఇది ఆయన అనుచరుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

మంత్రి కొండా సురేఖ స్థానంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సోదరుడి భార్య, మాజీ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతికి మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

మంత్రివర్గ మార్పులతో పాటు, పార్టీ పదవుల్లోనూ కీలక మార్పులు ఉండవచ్చనే చర్చ నడుస్తోంది. ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఏఐసీసీ (ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ)లోకి తీసుకుని జాతీయ స్థాయిలో బాధ్యతలు అప్పగించే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.మంత్రి పొన్నం ప్రభాకర్ స్థానంలో బీసీ వర్గానికి చెందిన మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించే అవకాశం ఉంది. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించవచ్చని ప్రచారం జరుగుతోంది.

మరో కీలక ప్రచారంలో భాగంగా, మంత్రి శ్రీధర్ బాబుకు పీసీసీ (తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) చీఫ్ పదవి అప్పగించవచ్చని, దాంతో పాటు ఆయనకు హోంమంత్రి పదవి కూడా కేటాయించాలనే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు సమాచారం.

మొత్తంగా, త్వరలో జరగబోయే ఈ ప్రక్షాళన ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని మరింత పటిష్టం చేసుకుని, రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలని భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ ఊహాగానాలు మరింత ఊపందుకోవడం ఖాయం.

## సీల్డ్ కవర్ సర్పంచ్, కొండారెడ్డిపల్లెలో ఏకగ్రీవ చరిత్ర!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లె గ్రామ పంచాయతీ ఎన్నిక చరిత్రలో నిలిచిపోయే విధంగా ఏకగ్రీవంగా ముగిసింది. ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వ్ అయిన సర్పంచ్ పదవికి, రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి సహకారంతో గ్రామ పెద్దలు అరుదైన చొరవ తీసుకుని ఈ ఎన్నికను ఏకగ్రీవం చేశారు. సర్పంచ్ పదవికి మొత్తం 15 మంది దళిత అభ్యర్థులు పోటీ పడటానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, గ్రామంలో అనవసర విభేదాలు రాకుండా ఉండేందుకు కొండారెడ్డిపల్లె గ్రామ పెద్దలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తిరుపతిరెడ్డిల సహకారం, మార్గనిర్దేశంతో గ్రామస్తులంతా ఏకాభిప్రాయానికి వచ్చి, 15 మంది దళిత అభ్యర్థులలో ఒకరిని ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ ఏకగ్రీవ నిర్ణయంలో మరింత ఉత్కంఠను రేకెత్తిస్తూ, గ్రామ పెద్దలు ఒక వినూత్న పద్ధతిని అనుసరించనున్నారు. పోటీ పడటానికి సిద్ధంగా ఉన్న ఆ 15 మంది దళిత అభ్యర్థులలోంచి ఎంపిక చేసిన వ్యక్తి పేరును 'సీల్డ్ కవర్‌లో' ఉంచి, ఆ కవర్‌ను నిర్దేశిత సమయంలో బహిరంగంగా ప్రకటించాలని నిర్ణయించారు. గ్రామంలో ఎలాంటి వర్గ విభేదాలకు తావు లేకుండా, అందరి ఆమోదం పొందిన అభ్యర్థిని ఎన్నుకోవాలనే లక్ష్యంతో తీసుకున్న ఈ 'సీల్డ్ కవర్ సర్పంచ్' నిర్ణయం రాష్ట్రంలోనే చర్చనీయాంశంగా మారింది. అభివృద్ధి, సామరస్యం కోసం స్థానిక పెద్దలు తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు ఆదర్శప్రాయంగా నిలవనుంది అంటున్నారు స్థానికులు.

## పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు కేటీఆర్ కౌంటర్ : 'తెలంగాణ ఉద్యమంలో ఎక్కడున్నావ్?

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రపై చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రంగా కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో మహేష్ కుమార్ గౌడ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నిస్తూ, కాంగ్రెస్ నాయకులు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన కీలక పరిణామాలను కేటీఆర్ గుర్తుచేశారు. అసలు తెలంగాణ ఉద్యమంలో మహేష్ కుమార్ గౌడ్ ఎక్కడ ఉన్నాడు. అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

అంతేకాకుండా, రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ..ఆనాడు ఇక్కడ రాష్ట్రంలో, కేంద్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే... డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన సమయంలో మీ ఢిల్లీ కాంగ్రెస్ నాయకులే చెప్పారు.. కేసీఆర్ గారి ప్రాణం ముఖ్యం, దీక్ష విరమించండి అని, అంటూ కేసీఆర్ దీక్ష సమయంలోని సంఘటనలను గుర్తుచేశారు.

కాంగ్రెస్ నాయకుల విమర్శలపై స్పందిస్తూ, కాంగ్రెస్ నాయకులు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు.అంటూ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు, విమర్శలు పూర్తిగా అవాస్తవాలని, వారికి ఆ చరిత్ర గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. మొత్తంగా, టీపీసీసీ అధ్యక్షుడి వ్యాఖ్యలకు కేటీఆర్ ఇచ్చిన కౌంటర్ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడిని రాజేసింది.

## కర్ణాటక పవర్ షేరింగ్‌పై 'బ్రేక్‌ఫాస్ట్' దౌత్యం, ఉద్రిక్తతకు తెరపడినట్టేనా?

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న ముఖ్యమంత్రి పదవి పంపకం (పవర్ షేరింగ్) వివాదంపై తెరదించేందుకు సీఎం సిద్ధరామయ్య మరియు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లు శనివారం ఒక కీలక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాల మేరకు సీఎం సిద్ధరామయ్య డీకే శివకుమార్‌ను తన నివాసంలో అల్పాహారం కోసం ఆహ్వానించారు.ముఖ్యమంత్రి పదవిపై ఇద్దరు అగ్రనేతల మధ్య బహిరంగంగా వాగ్వాదం జరగడంతో, పార్టీ హైకమాండ్ జోక్యం చేసుకుని ఇద్దరూ కలిసి సమావేశమై సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది.ఈ నేపథ్యంలోనే సిద్ధరామయ్య నివాసానికి డీకే శివకుమార్ చేరుకున్నారు. ఇద్దరు నాయకులు కలిసి అల్పాహారం తీసుకున్నారు. ముఖ్యమంత్రి న్యాయ సలహాదారు ఏఎస్ పొన్నన్న కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశం అనంతరం ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడుతూ ఐక్యతను చాటుకున్నారు. తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని, మీడియానే గందరగోళం సృష్టించిందని సిద్ధరామయ్య అన్నారు. "మేమిద్దరం కలిసి ఉన్నాం, మా ఐక్యత కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.సీఎం పదవిపై తుది నిర్ణయం కాంగ్రెస్ హైకమాండ్‌దే అని ఇద్దరు నేతలు పునరుద్ఘాటించారు. "హైకమాండ్ ఏం చెబితే దానికి కట్టుబడి ఉంటాం" అని శివకుమార్ తెలిపారు.ఈ సమావేశంలో కర్ణాటక రాష్ట్ర ప్రాధాన్యతలు, భవిష్యత్తు ప్రణాళికలపై ఉత్పాదక చర్చ జరిగిందని డీకే శివకుమార్ ట్వీట్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు పూర్తి కావస్తున్న నేపథ్యంలో, 2023లో జరిగినట్లుగా చెబుతున్న 'పవర్ షేరింగ్' ఒప్పందం ప్రకారం డీకే శివకుమార్‌కు సీఎం పదవి ఇవ్వాలని ఆయన మద్దతుదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశం తర్వాత ఇద్దరు కీలక నేతలు ఐక్యతను ప్రదర్శించినప్పటికీ, ముఖ్యమంత్రి మార్పుపై అంతర్గత చర్చలు, ఊహాగానాలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి. హైకమాండ్ త్వరలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# తెలంగాణ జాతిపిత కేసీఆర్

భారతదేశ చరిత్రలో మహాత్మా గాంధీ స్థానం సుస్థిరం. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసా మార్గంలో సాగిన స్వదేశీ పోరాటానికి ఆయన నాయకత్వం వహించి, దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించారు. అందుకే ఆయన్ని యావత్ భారత జాతి జాతిపితగా గౌరవిస్తుంది. సరిగ్గా ఇలాంటి పోరాట స్ఫూర్తితోనే, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమాన్ని నడిపించి, చివరికి రాష్ట్రాన్ని సాధించిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) ని తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ జాతిపితగా అభివర్ణిస్తున్నారు.

మహాత్మా గాంధీ అనుసరించిన సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, అహింస వంటి ఆయుధాలనే కేసీఆర్ కూడా తెలంగాణ ఉద్యమంలో సమర్థవంతంగా ఉపయోగించారని విశ్లేషకులు చెబుతున్నారు. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ దీక్షలు ఎలా కీలక పాత్ర పోషించాయో, అలాగే 2009 నవంబర్ 29న కేసీఆర్ "తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో" అనే నినాదంతో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష యావత్ దేశాన్ని కదిలించి, ప్రత్యేక రాష్ట్ర ప్రక్రియకు పునాది వేసింది. చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచింది.మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ పూర్తిగా శాంతియుత మార్గంలో నడిపించారు. గాంధేయ స్ఫూర్తితోనే మిలియన్ మార్చ్, సాగరహారం, సకల జనుల సమ్మె వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టి, కోట్ల మంది ప్రజల ఆకాంక్షను ప్రపంచానికి చాటిచెప్పారు. ఈ సుదీర్ఘ పోరాటంలో ఎక్కడా హింసకు తావు లేకుండా ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించడం ఆయన నాయకత్వ పటిమకు నిదర్శనం. కేసీఆర్ ని 'తెలంగాణ జాతిపిత'గా బీఆర్ఎస్ నాయకులు (మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, కేటీఆర్, కవిత వంటివారు) పదే పదే ప్రకటిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర తిరుగులేనిది అని, తన ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించారని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు. అయితే, ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కొందరు తెలంగాణ ఉద్యమకారులు, ఇతర రాజకీయ నాయకులు ఈ వాదనను అంగీకరించడం లేదు. ప్రొఫెసర్ కోదండరాం వంటివారు తెలంగాణ సాధన కేవలం కేసీఆర్ వల్లే జరగలేదని, ఇందులో ఆయనది ఒక పాత్ర మాత్రమేనని స్పష్టం చేశారు.?సీఎం రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ 'తెలంగాణ జాతిపిత' కాదన్నారు. మొదటి దశ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీని, మలిదశ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ ని 'తెలంగాణ జాతిపిత'గా ఆయన పేర్కొన్నారు. ఏదేమైనా, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర చారిత్రాత్మకమైనది. ఉద్యమ నాయకుడిగా, రాష్ట్ర సాధకుడిగా, తొలి ముఖ్యమంత్రిగా ఆయన స్థానం తెలంగాణ చరిత్రలో సుస్థిరం, అంటున్నారు.

## పవన్ కళ్యాణ్‌పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి 'అగ్గిరాజేసే' వ్యాఖ్యలు

హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను టార్గెట్ చేస్తూ అనిరుధ్ రెడ్డి చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రస్థానం, ఆయన ఆంధ్రప్రదేశ్ పట్ల నిబద్ధతపై అనిరుధ్ రెడ్డి నేరుగా విమర్శనాస్త్రాలు సంధించారు. ఆయన చేసిన వ్యాఖ్యల్లో ముఖ్యంగా మూడు అంశాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ఏపీలో నీకు సింగిల్ పోయే దమ్ము లేక పొత్తు పెట్టుకున్నావ్" అంటూ పవన్ కళ్యాణ్ (టీడీపీ–బీజేపీ–జనసేన) కూటమి నిర్ణయాన్ని అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. ఇది జనసేన బలంపైనే నేరుగా అనుమానాలు రేకెత్తించింది.

చిరంజీవి లేకపోతే నిన్ను ఎవ్వడు దేకడు" అనే వ్యాఖ్యతో అనిరుధ్ రెడ్డి మంటలు రేపారు. పవన్ కళ్యాణ్ స్టార్‌డమ్ అంతా ఆయన అన్నయ్య మెగాస్టార్ చిరంజీవి పుణ్యమేనని, సొంతంగా ఆయనకు బలమైన ఫాలోయింగ్ లేదనే అర్థం వచ్చేలా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది మెగా అభిమానుల మధ్య కూడా విభేదాలకు తావిచ్చే అవకాశం ఉంది.

ఏపీపై అంత ప్రేమ ఉంటే హైదరాబాద్ లో ఎందుకుంటున్నావు" అంటూ పవన్ కళ్యాణ్ నివాసంపై అనిరుధ్ రెడ్డి సెటైర్ వేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై మాట్లాడే నాయకుడు హైదరాబాద్‌లో ఉంటూ పాలన గురించి ప్రశ్నించడం ఎంతవరకు సమంజసమని ఆయన నిలదీశారు. అనిరుధ్ రెడ్డి గతంలోనూ ఆంధ్ర, తెలంగాణ అంశాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. అయితే, ఇప్పుడు నేరుగా పవన్ కళ్యాణ్ వంటి సినీ–రాజకీయ ప్రముఖుడిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఈ వ్యాఖ్యలపై జనసేన వర్గాలు తీవ్రంగా స్పందించే అవకాశం ఉంది.ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో, పవన్ కళ్యాణ్ కూటమికి కౌంటర్ ఇవ్వాలనే వ్యూహంలో భాగంగానే అనిరుధ్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారా, లేక ఇది పూర్తిగా వ్యక్తిగత విమర్శనా అనే దానిపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ విశ్లేషణలు ఊపందుకున్నాయి. జనసేన నాయకుల నుండి ఈ వ్యాఖ్యలపై ఘాటైన కౌంటర్ లేదా వివరణ వచ్చే అవకాశం ఉంది. ఈ అంశంపై పవన్ కళ్యాణ్ అభిమానుల ప్రతిస్పందన ఎలా ఉంటుందో చూడాలి.

## మాదాపూర్‌లో మరోసారి కూల్చివేతలు - మైండ్‌స్పేస్ మార్గంలో పేదల షాపులు ధ్వంసం

మాదాపూర్, మైండ్‌స్పేస్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మరోసారి కూల్చివేతల కలకలం రేగింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) అధికారులు శనివారం వీకెండ్ సందర్భంగా బుల్డోజర్లు, హైడ్రాలను ఉపయోగించి పలు నిర్మాణాలను, ముఖ్యంగా చిన్న వ్యాపార దుకాణాలను కూల్చివేశారు.వివరాల్లోకి వెళ్తే, మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న అనేక చిన్నపాటి షాపులను, తోపుడు బండ్ల వంటి తాత్కాలిక నిర్మాణాలను అధికారులు ధ్వంసం చేశారు. ఇవి రోడ్డుకు ఆనుకుని అక్రమంగా నిర్మించారని లేదా ఆక్రమించారని అధికారులు పేర్కొన్నారు.

కూల్చివేతలకు గురైన వాటిలో ఎక్కువగా టీ స్టాల్స్, టిఫిన్ సెంటర్లు, చిన్నపాటి కిరాణా దుకాణాలు వంటివి ఉన్నాయి. తమ జీవనాధారం కూలిపోవడంతో ఆ షాపుల యజమానులు, పేద వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

గత కొన్ని రోజులుగా హైడ్రా అధికారులు నగరంలో అక్రమ నిర్మాణాలపై, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే ఈ వీకెండ్‌లో కూడా కూల్చివేతల డ్రైవ్ చేపట్టారు. మాదాపూర్, అయ్యప్ప సొసైటీ వంటి ప్రాంతాల్లో గతంలో భారీ భవనాలను కూడా కూల్చివేశారు.

ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేతలు చేపట్టారని, తమకు కనీసం సామాన్లు తరలించుకునే సమయం కూడా ఇవ్వలేదని బాధితులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్న వ్యాపారాలపై ఈ కూల్చివేతలు తీవ్ర ప్రభావం చూపాయి. అయితే, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే, పాదచారులకు ఇబ్బంది కలిగించే అక్రమ ఆక్రమణలను తొలగించడంలో రాజీపడబోమని అధికారులు స్పష్టం చేశారు. నగరంలో అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను తొలగించే కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

## వరంగల్‌లో రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి, సికింద్రాబాద్ ఎంపీ శ్రీ జి. కిషన్‌రెడ్డి శనివారం వరంగల్‌లోని రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ) నిర్మాణ పనులను పరిశీలించారు. వరంగల్ ప్రజల చిరకాల స్వప్నమైన ఈ రైల్వే యూనిట్ నిర్మాణం త్వరలోనే సాకారం కాబోతోందని ఆయన ప్రకటించారు.ఈ రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌ను మొత్తం 160 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.దీని నిర్మాణానికిగాను కేంద్ర ప్రభుత్వం రూ.521 కోట్లను కేటాయించింది. మంత్రి తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టులో ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయి. పనుల నాణ్యత, వేగంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. యూనిట్ పూర్తయిన తర్వాత, ఇక్కడ అత్యాధునిక పరికరాలను ఉపయోగించి, 16 కోచ్‌లతో కూడిన ఉత్పత్తి జరగబోతోంది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ముఖ్యమైన హామీ ఇచ్చారు. ఈ రైల్వే యూనిట్‌లో కల్పించబడే ఉద్యోగాల విషయంలో స్థానికులకే అధిక ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ యూనిట్ వల్ల వరంగల్ ప్రాంత యువతకు మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అధునాతన టెక్నాలజీతో కూడిన ఈ యూనిట్ నిర్మాణం పూర్తయితే, వరంగల్ ప్రాంత ఆర్థికాభివృద్ధికి, దేశంలో రైల్వే కోచ్‌ల ఉత్పత్తికి ఇది కీలక కేంద్రంగా మారనుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఓయూ డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ కలకలం, మలక్‌పేట కాలేజీలో పుస్తకాలు, ఫోన్లతో కాపీయింగ్

మొదటి పేజీ తరువాయి

రోడ్డుపై పెద్ద ఎత్తున పడి ఉన్న ఈ పుస్తకాలు, ఇతర కాపీ మెటీరియల్‌ను స్థానికులు, నెటిజన్లు గుర్తించడంతో అసలు విషయం బయటపడింది. 'రోడ్డుపై పడిన పుస్తకాలతోనే అసలు విషయం బహిర్గతమైంది' అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

డిగ్రీ పరీక్షల్లో జరుగుతున్న ఈ మాస్ కాటాయింగ్ వ్యవహారంపై విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల పర్యవేక్షణ, నిర్వహణపై ఓయూ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై యూనివర్సిటీ అధికారులు లేదా కళాశాల యాజమాన్యం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల అనంతరం ఎంత మంది విద్యార్థులపై చర్యలు తీసుకున్నారు అనే వివరాలు తెలియాల్సి ఉంది.

## నన్ను మాత్రం మోసం చేయలేదు, నన్నే అంటిపెట్టుకొని ఉన్నారని అంటుంది

మొదటి పేజీ తరువాయి

నేను ఒకదానితో అతుక్కొని ఉండలేను. ఒకవైపు నటుడిగా, మరోవైపు హిందూపురం ఎమ్మెల్యేగా, ఇంకోవైపు బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా ఇలా అనేక పాత్రల్లో ఉంటాను. ఒకేచోట ఉండను అని తెలిపారు.

అయితే, తన భార్య విషయంలో మాత్రం తాను ఒకే చోట అంటిపెట్టుకుని ఉంటానని చెప్పారు. అదే నా భార్య విషయంలో. నా భార్య ఎప్పుడూ అంటుంది. 'హమ్మయ్య! నన్ను ఈ విషయంలో మోసం చేయలేదు. నన్నే అంటిపెట్టుకొని ఉన్నారు' అని అంటుంది అంటూ బాలకృష్ణ నవ్వుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.

బాలకృష్ణ చేసిన ఈ సరదా వ్యాఖ్యలు ఆయన అభిమానులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నిత్యం బిజీగా ఉండే జీవితంలోనూ ఆయన తన కుటుంబం పట్ల, భార్య పట్ల చూపించే నిబద్ధతను ఈ మాటలు తెలియజేస్తున్నాయి. బాలయ్య దంపతుల అనుబంధంపై పంచుకున్న ఈ విషయం సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతోంది.

## రాజీవ్ గాంధీపై చేయి వేస్తే నీ తాట తీస్తాం.. జాగ్రత్త! కేటీఆర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ కోసం చేసిన సేవలను గుర్తుచేస్తూ, 'మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడితే కేటీఆర్ ఎగిరి పడుతున్నాడు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో చిన్నారెడ్డి నాయకత్వంలో సాగిన సంతకాల సేకరణలో మహేష్ గౌడ్ కీలక పాత్ర ఉందని గుర్తు చేశారు. సాగరహారం రోజు కేసీఆర్, కేటీఆర్ ఎక్కడ ఉన్నారు? అంటూ దయాకర్ నిలదీశారు. తెలంగాణ సాధనకు వ్యతిరేకంగా కేసీఆర్ అవకాశవాద రాజకీయాలు చేశాడని, మిలియన్ మార్చ్‌ను కూడా అడ్డుకున్నాడని ఆరోపించారు. ఉదంతంలో కోదండరాం, గద్దర్, అందెశ్రీ, గూడ అంజయ్యలను కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చింది అని కేసీఆర్ అన్నాడు. అదే సోనియాను తర్వాత బజారుకీడుస్తున్నారని అనడం నిచ రాజకీయమేగాని మరేమీ కాదు.. అని దయాకర్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌ను చంపడానికి కేసీఆర్ ప్రయత్నించాడని ఆరోపించారు.

తెలంగాణ నిజమైన బిడ్డ రేవంత్ రెడ్డినేనని పేర్కొంటూ, కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి సోనియాకు రేవంత్ బహుమతి ఇచ్చాడు అని అన్నారు. అందె శ్రీ అంత్యక్రియలలో సీఎం రేవంత్ వ్యవహరించిన తీరు దేశం చూసి అబ్బురపడిందని కొనియాడారు. బీఆర్ఎస్‌లో ఇప్పుడు 'ఫోర్–20' మాత్రమే మిగిలారని, సర్పంచ్ ఎన్నికల్లో సెంటిమెంట్ కోసం హడావిడి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పి అంబేద్కర్‌ను అవమానించాడని కూడా ఆరోపించారు. 'రాజీవ్ గాంధీపై చేయి వేస్తే నీ తాట తీస్తాం.. జాగ్రత్త!' అని కేటీఆర్‌ను హెచ్చరించారు. తెలంగాణలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం 'కల్ల' అని ప్రకటించారు. ఉద్యమకారులను జైలులో పెట్టిన చరిత్ర కేసీఆర్ ది అని, రాక్షసంగా వ్యవహరించాడని అని దయాకర్ విమర్శించారు. తెలంగాణ ప్రజల రుణం తీర్చుకునే పనిలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన చీరలు, కేసీఆర్ ఇచ్చిన చీరలు.. జనం తేడా చూస్తున్నారని, పిచ్చి మాటలు మాట్లాడి కేటీఆర్ తన ఇజ్జత్ తీసుకోవద్దని దయాకర్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబాన్ని ఊసరవెల్లితో పోలుస్తూ, అది కూడా వాళ్లను చూసి సిగ్గుపడుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి పేరు ఎత్తడానికి కూడా కేసీఆర్‌కు భయం.. అసెంబ్లీకి రావడానికి కారణమే రేవంత్ రెడ్డి భయం అని దయాకర్ వ్యాఖ్యానించారు.

# దిత్వా తుఫాను బీభత్సం.. విద్యా సంస్థలకు సెలవు, విమానాలు రద్దు

మొదటి పేజీ తరువాయి

ఉత్తర, వాయువ్య దిశగా ప్రస్తుతం గంటకు 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర–వాయువ్య దిశగా కదులుతోన్న తుఫాను పుదుచ్చేరికి దక్షిణ, ఆగ్నేయంగా 400 కి.మీ, చెన్నైకి దక్షిణంగా 500 కి.మీ దూరంలో కేంద్రీకృతమైంది. నవంబరు 30న తెల్లవారుజామున తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు చేరుకుంటుంది.

దీని ప్రభావంతో ఉత్తర తమిళనాడులో అనేక చోట్ల, దక్షిణ తమిళనాడులో కొన్నిచోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. మైలాడుతురై, కడలూరు, విళ్లుపురం, చెంగల్పట్టు, పుదుచ్చేరిలో కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒకటి రెండు చోట్ల అత్యంత భారీవర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. పుదుక్కోట్టై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, అరియలూరు, పెరంబలూరు, తిరుచ్చి, సేలం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై, కాంచీపురం, చెన్నై, తిరువళ్లూరు, రాణిపేట, కారైక్కల్‌లో భారీ నుంచి అతి భారీ, వేలూర్, తిరుప్పత్తూర్, కృష్ణగిరి, ధర్మపురి, నామక్కల్, కరూర్‌లో భారీవర్షానికి అవకాశం ఉందని అంచనా వేసింది.

ఆదివారం తమిళనాడు దక్షిణ తీర, డెల్టా జిల్లాలు, కారైక్కల్‌లో గంటకు 55 నుంచి 65 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. తిరువళ్లూరు, రాణిపేట జిల్లాలో భారీ నుంచి అతి భారీ, ఒకటి రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు.. మిగతా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం, డిసెంబరు 1న తిరువళ్లూరు జిల్లాలో భారీవర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీచేసింది.

నాగపట్టణం, పాంబన్, తూత్తుకుడి, కారైక్కల్, చెన్నై, ఎన్నూర్, కాట్టుపల్లి, పుదుచ్చేరి ఓడరేవుల్లో నాలుగో నెంబరు ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. తుఫానుతో ధనుష్కోటిని మూసివేసి, పర్యాటకులు, వ్యాపారులు, ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించారు.

తుఫాను కారణంగా వచ్చే 48 గంటల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న అంచనాలతో చెన్నై విమానాశ్రయంలో విమాన రాకపోకలపై పరిమితి విధించారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ 54 విమానాలను రద్దుచేశారు. దీంతో మదురై, బెంగళూరు, సేలం, తూత్తుకుడి, తిరుచ్చరాపల్లి, హైదరాబాద్, జఫ్నా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది.

శనివారం పెరంబలూరు, తిరువరూర్, నాగపట్టణం, కడలూరు, కళ్లకురుచ్చి, పుదుకొట్టైయ్, పుదుచ్చేరి, కరైకల్, మైలాదుతురై జిల్లాలో విద్యా సంస్థలను మూసివేశారు. విల్లుపురం, తంజావూరు, తిరుచ్చి జిల్లాల్లో కేవలం స్కూళ్లకు మాత్రమే సెలవులు ప్రకటించారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ శనివారం నిర్వహించాల్సి పరీక్షలను రద్దు చేసి, సెలవు ప్రకటించింది. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అత్యవసర సమావేశం నిర్వహించి, చేపట్టాల్సిన చర్యల గురించి దిశనిర్దేశనం చేశారు. ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో సహాయక చర్యల కోసం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ దళాలను సిద్ధం చేశారు.

# మేడారం జాతరకు జాతీయ హోదా సాధ్యం కాదు: కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

జాతీయ హోదా కోసం ప్రభుత్వం డిమాండ్:

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసి, గిరిజన జాతర అయిన మేడారం మహాజాతరను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలు వేదికలపై ప్రస్తావించారు. కుంభమేళాకు కేటాయిస్తున్నట్లుగానే రూ.వేల కోట్ల నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మేడారం మహాజాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరగబోతోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ తో అభివృద్ధి పనులు చేపట్టింది. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. మాస్టర్ ప్లాన్ తో మేడారం జాతర రూపురేఖలే మారబోతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది.

## 'ఆ స్లీపర్ బస్సులు ఇక వాడొద్దు, పక్కన పెట్టేయండి' రాష్ట్రాలకు NHRC కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

ప్రమాదాలకు కారణాలు ఇవే..!

ప్రస్తుతం దేశంలో తిరుగుతున్న బస్సుల్లో 50 శాతానికి పైగా స్లీపర్ ఏసీ బస్సులే ఉంటున్నాయి. అయితే ట్రావెల్స్ సంస్థలు ఇష్టానుసారం బస్సులను మార్పులు చేర్పులు చేసి నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేకాకుండా చాలా బస్సుల్లో అగ్ని ప్రమాదాలను నియంత్రించే రక్షణ వ్యవస్థలు (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు) ఉండటం లేదు. ట్రావెల్స్ సంస్థలు కూడా బస్సుల కండీషన్‌పై ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టడం లేదు. ఇది చాలదన్నట్లుగా అత్యవసర ద్వారం ఉన్నచోట్ల కూడా సీట్లు ఏర్పాటు చేయడం లేదా అదనపు సీట్ల నిర్మాణంతో ప్రమాద సమయాల్లో అవి నిరుపయోగంగా మారుతున్నాయి. దీంతో ప్రమాద సమయాల్లో ప్రయాణికులు వాటిని తీసేసి బయటకు వెళ్లలేకపోతున్నారు.


## విద్యుత్‌తోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యం.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు


మొదటి పేజీ తరువాయి

భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు..

విద్యుత్ ఉంటేనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమని భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ వినియోగంలో 2030 వరకు 50 శాతం గ్రీన్ ఎనర్జీనే ఉండాలని పారిస్ ఒప్పందం చెబుతోందని అన్నారు. 2070 వరకు పూర్తిగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించాలనే ఒప్పందం ఉందన్నారు. సోలార్, థర్మల్, విండ్, స్టోరేజీలలో మనం వెనుకబడి ఉన్నామన్నారు. విద్యుత్ స్టోరేజీపై మనం ఇంతవరకు సరిగ్గా ప్లాన్ చేసుకోలేదని తెలిపారు. 2027 నుంచి 2028 వరకు థర్మల్ పవర్‌లో మనకు ఇబ్బందులు ఉండవన్నారు. 2029 నుంచి 2030 వరకు వెయ్యి మెగావాట్లు మైనస్‌లోకి వెళ్తామని అన్నారు. 2029-30 నాటికి విద్యుత్ స్టోరేజీ 8,207 మెగావాట్లు అవసరమని.. సోలార్ పవర్ కొనుగోలు చేయాలంటే 25 ఏళ్ల అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## మడిపల్లి గ్రామంలో దొంగల హల్చల్





తొర్రూరు, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): మడిపల్లి గ్రామంలో దొంగలు రెచ్చిపోతున్నారు. గత నాలుగు రోజుల నుంచి తాళం వేసి ఖాళీగా ఉన్న ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు, భారీ దోపిడీకి పాల్పడ్డారు. గ్రామం లో కిరాణా దుకాణం నడుపుతున్న రంగు సుగుణమ్మ అనే మహిళ తన బంధువుల వివాహానికి వెళ్లి నాలుగు రోజుల తర్వాత ఇంటికి చేరుకుంది. తాళం తీసేందుకు వెళ్లగా తాళం పూర్తిగా పగలగొట్టి ఉండటం ఆమె గమనించింది. వెంటనే ఇంట్లోకి వెళ్ళి చూడగా అన్ని వస్తువులు ఎక్కడికక్కడ చిందరవందరగా కనిపించాయి. 20 వేల నగదు, రెండున్నర గ్రాముల బంగారం, 15 తులాల వెండి పట్టీలు, రెండు గ్యాస్ సిలిండర్లు దొంగిలించబడ్డాయని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గత రెండు నెలలుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పగటిపూట ఎవరూ సమయంలో దొంగలు భారీగా గ్యాస్ సిలిండర్లు అపహరిస్తున్నారు. ఇప్పటి వరకు గ్రామంలో సుమారు 30 గ్యాస్ సిలిండర్లు మాయమయ్యాయి అని వారు ఆవేదన వ్యక్తం చేసారు.

## వెజిటేబుల్ కార్వింగ్ డే ఘనంగా నిర్వహణ



తొర్రూరు , 29 నవంబర్ (క్రాంతి న్యూస్): వికాస్ పాఠశాలలో వెజిటేబుల్ కార్వింగ్ డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అనేక రకాల కూరగాయలను మొసలి, వినాయకుడు, పుట్టగొడుగులు, ఎడ్ల బండి, విమానం, పూల మొక్కలు ఎలుక కుందేలు ఫ్లవర్ బాస్కెట్ అనేక రకాల పుష్పాలు వంటి అనేక ఆకృతులను తయారు చేసి ప్రదర్శించారు. అలాగే ప్రదర్శించిన కూరగాయల యొక్క ప్రాముఖ్యతని, వాటిలో ఉండే విటమిన్స్, మినరల్స్ ని చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులలో ఆరోగ్యకరమైన అంశాల పట్ల అవగాహన కల్పించడం, సృజనాత్మకతను వెలికి తీయడానికి మన పాఠశాలలో నిరంతర కార్యక్రమాలు,నిర్వహించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కేవీ రెడ్డి , శ్రీలత , ప్రిన్సిపాల్ వేణుమాధవ్, నాగరాజు వైస్ ప్రిన్సిపల్ రాజు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎన్నికలవేళ 144 సెక్షన్ అమలు



ఇనుగుర్తి, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): గ్రామ పంచాయితీ ఎన్నికల దృష్ట్యా ఇనుగుర్తి మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకై 144 సెక్షన్ విధిస్తున్నట్లు స్థానిక ఎస్సై కరుణాకర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై కరుణాకర్ పత్రిక ప్రకటనలో భాగంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇనుగుర్తి మండల పరిధిలో 144 సెక్షన్ విధించడం జరిగిందని ప్రజలు 4గురు కంటే ఎక్కువ మంది ఒకే చోట గుమ్మి కూడా రాదని, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రజలు సహకరించాలని, హింసకు పాల్పడ్డా, చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

## మాచర్ల శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం

### -డాక్టర్ మంగళ పెల్లి హుస్సేన్



తొర్రూర్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): మండలానికి చెందిన అమ్మాపురం గ్రామానికి చెందిన ప్రముఖ కానుక రిపోర్టర్ గౌడ సంఘం నాయకులు, మానవ హక్కుల న్యాయ సేవా సంఘం నేత మాచర్ల శ్రీనివాస్ మరణం స్థానిక సమాజానికి, జర్నలిజం రంగానికి తీరని లోటని హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళ పెల్లి హుస్సేన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.శ్రీనివాస్ సంతాప దినాన్ని పురస్కరించుకొని, శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని అన్నారం రోడ్డు విశ్రాంతి భవనం దగ్గర సంతాప సభ నిర్వహించారు.డాక్టర్ మంగళ పెల్లి హుస్సేన్ మాచర్ల శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.శ్రీనివాస్ జర్నలిస్టుగా, గౌడ సంఘం నాయకుడిగా, మానవ హక్కుల కోసం కృషి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. నిస్వార్థంగా ఆయన చేసిన సేవలు, పేద ప్రజల పక్షాన నిలిచిన తీరు చిరస్మరణీయమని కొనియాడారు. జర్నలిస్టులతో కలిసి ఆయన శ్రీనివాస్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సంతాప కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, ఐజేయు సభ్యులు: దూలం శ్రీనివాస్,డిజిటల్ మీడియా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, హ్యూమన్ రైట్స్ డివిజన్ కమిటీ సభ్యులు కొండ్లె ఉమేష్,హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కమిటీ సభ్యులు: దేశగాని అశోక్ గౌడ్,హ్యూమన్ రైట్స్ జిల్లా కమిటీ సభ్యులు వీరస్వామి, నరేష్, మహేష్. తొర్రూర్ వర్కింగ్ జర్నలిస్టులు వేల్పూరి పూర్ణచందర్,పస్తం సాంబ, అమీర్, కిషన్, రాజేందర్, కృష్ణ రెడ్డి, రాజు, యాదగిరి, బూరుగు శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ నేతల సామాజిక సేవకు జేజేలు

### ఉచిత వైద్య శిబిరంలో 13 మందికి కంటి ఆపరేషన్లు

### అభినందించిన ఏఎంసీ చైర్మన్ బాల్ రెడ్డి



వికారాబాద్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): కాంగ్రెస్ పార్టీ నాయకులు చాటుకుంటున్న సామాజిక సేవకు పలువురు జేజేలు పలుకుతున్నారు. రెండు రోజుల క్రితం తాండూరు పట్టణం సాయిపూర్ 11 వ వార్డులో కాంగ్రెస్ నాయకులు లొంక నర్సింలు, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బంటు వేణుగోపాల్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన 13 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని హైదరాబాద్ కు తరలించి.. ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. తిరిగి వారిని తాండూరుకు తీసుకవచ్చి సొంత ప్రాంతాలకు తరలించారు. కాంగ్రెస్ నాయకులు చేసిన సామాజిక సేవ కార్యక్రమంతో 13 మందికి కంటి చూపు ప్రసాదించి.. వెలుగులు నింపారు. ఈ సందర్భంగా తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి లొంక నర్సింలు, బంటు వేణుగోపాల్ లను అభినందించారు. అదేవిధంగా లొంక నర్సింలు, బంటు వేణుగోపాల్ మాట్లాడుతూ తమ వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

# రాజులకొత్తపల్లి గ్రామంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ ఎన్నికలు ఉల్లంఘించిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలి

### టీఆర్పీ రాష్ట్ర యువ నాయకుడు వరిపెల్లి అనిల్ కుమార్.



నెల్లికుదురు, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామంలో రాబోయే సర్పంచ్ ఎన్నికలు పూర్తిగా ప్రజాస్వామ్యపరంగా, రాజ్యాంగబద్ధంగా జరగాలని కోరుకుంటున్నా అని టీఆర్పీ రాష్ట్ర యువ నాయకులు వరిపల్లి అనిల్ కుమార్ తెలిపారు. గ్రామాభివృద్ధి పట్ల బాధ్యతగల యువ నాయకుడిగా, మన రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొన్న నిబంధనలు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని గ్రామ ప్రజలు మరియు అభ్యర్థులందరినీ పాటించాలని ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా డబ్బులు, మద్యం పంచి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగితే, ఆ ఘటనలను గ్రామ ప్రజలు నుండి నాకు ఆధారాలు పంపిస్తున్నారు గ్రామ యువత . అలాంటి ప్రతి సాక్ష్యాన్ని – ఫోటోలు, వీడియోలను నేను ఎన్నికల సంఘం మరియు సంబంధిత కోర్టుల్లో సమర్పించే బాధ్యత తీసుకున్నాను. గ్రామంలో అక్రమ పద్ధతులకు తావులేకుండా, ప్రజాస్వామ్యంగా పారదర్శకంగా ఎన్నికలు జరగడం మా యువత లక్ష్యం. ప్రచారం చేయడం ప్రతి అభ్యర్థి హక్కే అయినా, అది ఎన్నికల నియమావళి ప్రకారం ఉండాలి.

## పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి

### -ప్రశాంతంగా ముగిసే వరకు అప్రమత్తం తప్పనిసరి

### -తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య

### -పెద్దేముల్ మండలంలో క్లస్టర్ కేంద్రాల పరిశీలన



వికారాబాద్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): పంచాయతి ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలని తాండూరు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య సూచించారు. శనివారం పెద్దేముల్ మండలంలోని పంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల కోసం ఏర్పాటు చేసిన క్లస్టర్ కేంద్రాలను డీఎస్పీ సందర్శించారు. పెద్దేముల్ ఎస్ఐ శంకర్‌తో కలిసి కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద ఎన్నికల పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఎన్నికలలో జరిగే పరిణామాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ నర్సింగ్ యాదయ్య మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఒత్తిళ్లు, అక్రమ రవాణా, మద్యం అమ్మకాలపై ఇబ్బందులపై దృష్టిసారించాలన్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి గ్రామంలో శాంతిభద్రతలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## వివాహా దినోత్సవ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు విజయవంతం



తొరూర్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): చైర్ పర్సన్ లయన్ వజినపల్లి దీప – అనిల్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ సేవాతరుణి అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో 30,000/- విలువగల సేవా కార్యక్రమాలు నిర్వహించారు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రసాద వితరణ కార్యక్రమం మరియు జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో 130 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఎగ్జామ్ పాడ్స్,500 పెన్స్, 130 స్కేల్స్ పంపిణీ కార్యక్రమం అనంతరంకె.జి. బి.వి విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల నిమిత్తం 3000/- విలువగల ఆరు పట్టుచీరలను పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమాలలో టీడీజీ డాక్టర్ రాజేందర్ రెడ్డి డిస్టిక్ జిఎల్టి కోఆర్డినేటర్ లైన్ డాక్టర్ వేలూరు శారద డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ లయన్ డాక్టర్ ఎస్ నాగవాణి రీజియన్ చైర్ పర్సన్ లయన్ దామెర సరేష్, ట్రెజరర్ లయన్ వేముల మంజుల, లయన్ ఉమా రెడ్డి, వినయ్, మౌనిక, శ్రీదేవి అమ్మ పాల్గొన్నారు.

# పెద్దమందడి గ్రామ సర్పంచ్ గా నామినేషన్ దాఖలు వేసిన ఆత్మకూరు స్వాతి హరికుమార్ రెడ్డి (బుచ్చిబాబు)



వనపర్తి, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): పెద్ద మందడి గ్రామ పంచాయతీ బి ఆర్ ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా ఆత్మకూరు స్వాతి హరికుమార్ లు రెడ్డి శనివారం కార్యకర్తలతో భారీ ఊరేగింపు ర్యాలీతో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.వారు మాట్లాడుతూ...ప్రజల సంక్షేమమే మేరకు ప్రతి సమస్యకు అభివృద్ధికి పాటుపడుతానని ప్రజాక్షేత్రంలో ఉంటననీ మీ అందరి ఆశీస్సుల తో పని చేస్తానని అని మీ అమూల్యమైన ఓటు వేసినన్ను గెలిపించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా రైతు సమన్వయ కర్త జగదీశ్వర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,ఆత్మకూరు ప్రవీణ్ కుమార్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి,జంగంరమేష్,కొమ్ము విష్ణు,బ్రహ్మయ్య,సింగిరెడ్డి కురుమూర్తి,బాలనాగన్న, శ్రీనివాసరెడ్డి,మోహన్ రెడ్డి, ఆంజనేయులు సాగర్,గొల్ల ఈదన్న,బత్తిని మొగలాలి,పరమేశ్వరి,సుమిత్ర,గొల్ల నాగమ్మ,గ్రామ బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తునిలో దారుణం.. కాలుకు ఆపరేషన్ చేసి బ్లేడ్ మర్చిపోయిన డాక్టర్లు



ఏపీ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): తూర్పుగోదావరి జిల్లా తుని ప్రభుత్వ ఆస్పత్రిలో దారుణం జరిగింది. కాలుకు శస్త్ర చికిత్స చేసి బ్లేడ్ మర్చిపోయారు. ఎస్. అన్నవరం పంచాయతీ రామకృష్ణానగర్‌కు చెందిన యువకుడు చిన్నా కాలుకు గాయమయింది. దీంతో విశాఖ ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. కాలులో స్టీల్ రాడ్డు వేసి స్ర్కూ అమర్చారు. అయితే కాలుకు ఇబ్బంది కలగడంతో చిన్నా ఆస్పత్రికి వెళ్లారు. చికిత్స చేసి స్ర్కూను తొలగించిన వైద్యులు.. కాలులోనే బ్లేడును ఉంచి కుట్లు వేశారు. కాలు మరింత నొప్పిగా ఉండటంతో ఎక్స్ రే చేయించారు. దీంతో కాలులో బ్లేడ్ ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. తీవ్ర ఆందోళనకు గురైన బాధితుడు ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. ఈ మేరకు కాలుకు చికిత్స చేసి బ్లేడును తొలగించారు. అయితే ఈ విషయం బయటకు పొక్కడంతో ఆస్పత్రి సిబ్బందిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇలాంటివి మామూలేనని సోషల్ మీడియాలో నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు.

## ఎమ్మార్వో ఆఫీస్‌కు తాళం.. టీడీపీ ఎమ్మెల్యే కుమారుడి నిర్వాకంపై కలెక్టర్ సీరియస్



ఏపీ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): : సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే ఆదిమూలం కుమారుడు సుమన్ తీరు వివాదాస్పదంగా మారింది. జెడ్పీటీసీగా ఉన్న ఆయన ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లపై నారాయణ వనం ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇసుక ట్రాక్టర్లను స్థానిక రెవెన్యూ కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం వదిలేశారు. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మార్వో ఆఫీస్‌కు తాళం వేశారు. కార్యాలయంలోని సిబ్బంది అంత భయటకు పంపి తాళం వేశారు. దీంతో సుమన్ తీరుపై తహసీల్దార్ రోజా రాణి తిరుపతి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ సూచించినట్లు తెలుస్తోంది.


## విజయవాడలో రెచ్చిపోయిన లేడీ గ్యాంగ్




ఏపీ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): విజయవాడ నగరంలోని చౌకీ సెంటర్ పరిసరాల్లో లేడీ గ్యాంగ్ దోపిడీలతో స్థానిక వ్యాపారుల అవస్థలు పడుతున్నారు. అర్థరాత్రి సమయంలో ఈ గ్యాంగ్ వరుసగా దొంగతనాలకు పాల్పడుతూ మార్కెట్ ప్రాంతంలో ఆందోళనకర వాతావరణాన్ని సృష్టిస్తోంది. కాగా, గత కొన్ని రోజుల నుంచి శ్రీ లక్ష్మీ గణపతి కెమికల్స్ సహా సమీపంలోని పలు దుకాణాల్లో పెద్ద మొత్తంలో వస్తువులు కనిపించకుండా పోవడంతో వ్యాపారులు నష్టపోయారు. దుకాణంలో స్టాక్ తగ్గిపోవడాన్ని గమనించిన కెమికల్స్ షాప్ యజమాని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఆశ్చర్యకర విషయాలు రికార్డు అయ్యాయి.

అయితే, సీసీ కెమెరాల్లో లేడీ గ్యాంగ్ సభ్యులు రాత్రివేళ దుకాణంలో చొరబడి దొంగతనం చేస్తున్న దృశ్యాలు అందులో స్పష్టంగా కనిపించాయి. వెంటనే షాప్ యజమాని ఈ వీడియోలను ఆధారంగా చేసుకుని విజయవాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ చేశారు. ఇక, పోలీసులు వెంటనే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా లేడీ గ్యాంగ్ సభ్యుల గుర్తింపునకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. చౌకీ సెంటర్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, వరుస దొంగతనాలకు కారణమైన గ్యాంగ్‌ను వీలైనంత త్వరగా పట్టుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటారు.

## దిత్వా తుఫాను ముప్పు.. నేడు ఈ జిల్లాల్లో అతి భారీ వర్షాలు




ఏపీ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): ఏపీని దిత్వా తుఫాను ముప్పు భయపెడుతోంది. నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాను కేంద్రీకృతమై ఉంది. శనివారం మధ్యాహ్నం మూడు గంటల సమయానికి దిత్వా తుఫాను కారైకాల్‌కి 150 కి,మీ.,పుదుచ్చేరికి 250 కిలోమీటర్లు, చెన్నైకి 350కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. గత ఆరు గంటలుగా దిత్వా తుఫాను గంటకు పది కిలోమీటర్ల వేగంతో కదులుతున్నట్లు అంచనా వేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామునకు దిత్వా తుఫాను తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. అనంతరం తుఫాను.. తీవ్రవాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు.

దిత్వా తుఫాను ప్రభావంతో ఏపీలో ఆదివారం కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనా వేసింది. అలాగే గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, కర్నూలు,అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి ,ఏలూరు, కృష్ణా జిల్లా, ఎన్టీఆర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ అంచనా వేశారు.

### హోం మంత్రి అనిత సమీక్ష

మరోవైపు దిత్వా తుఫాను నేపథ్యంలో ఏపీ హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులతో సమీక్షించారు. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దిత్వా తుఫాను తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోం మంత్రి అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితులలో సహాయక చర్యల కోసం ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తుఫాను ప్రభావిత ప్రాంతాలకు పంపించాలని ఆదేశించారు.

## ప్రేమ జంటను పోలీస్ స్టేషన్‌లో దాచిపెట్టిన పోలీసులు.. ఉద్రిక్తత




ఏపీ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): ప్రాణ రక్షణ కోసం ప్రేమజంట ఆశ్రయించడంతో పోలీస్ స్టేషన్‌లో పెట్టి గేట్లు మూసి వేసిన ఘటన ఏలూరు జిల్లాలో జరిగింది. నూజివీడుకు చెందిన యువతి, యువకుడు ప్రేమించుకున్నారు. పెద్దలకు తెలియకుండా పెళ్లి చేసుకున్నారు. దీంతో వీరి వివాహాన్ని ఇరుకుటుంబాలు వ్యతిరేకించాయి. దీంతో పెద్దలకు బయపడి స్థానిక పోలీసులను ప్రేమ జంట ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాలు ఠాణా వద్దకు భారీగా చేరుకున్నారు. యువకుడిపై యువతి కుటుంబ సభ్యులు దాడి చేశారు. దీంతో యువతి, యువకుడిని పోలీస్ స్టేషన్‌లో ఉంచి బయట గేట్లు మూసివేశారు. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై మండిపడ్డారు. తమ కూతురుకి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడని యువతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఇప్పటికైనా తమ కూతురిని అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇరు కుటుంబాలతో పోలీసులు చర్చిస్తున్నారు. ప్రేమజంటకు హాని కలిగించొద్దని సూచించారు.

## 'ఆహా.. ఓహో అని డప్పు కొట్టడమేంటి'?.. సీఎం చంద్రబాబుపై షర్మిల ఫైర్



ఏపీ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు పై కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు. "మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె కావాలా? అనేలా ఏపీ సీఎం చంద్రబాబు తీరు ఉంది. తొలి విడత సేకరించిన 54 వేల ఎకరాల్లో వరల్డ్ క్లాస్ నగరం అమరావతి ఎక్కడ? ఐకానిక్ సముదాయాల నిర్మాణాలేవి? రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాల్లో 29 వేల మంది రైతులకు ఇచ్చిన హామీల సంగతేంటి? 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఒక్క కిలోమీటర్ అయినా నిర్మాణం జరిగిందా? కళ్ళముందు సింగపూర్, జపాన్, డిల్లీ నగరాలు కనిపిస్తున్నట్లు, అమరావతి విశ్వనగరంలో ఇక భూములు లేనట్లు అప్పుడే రెండో విడత 16 వేల ఎకరాల భూ సేకరణ మొదలు పెడతారా? ఇది రియల్ ఎస్టేట్ మాఫియా కాకుంటే మరేంటి? అని వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు.

అదానీ, అంబానీకి బాకీ పడ్డారని భూములు సేకరిస్తున్నారా? అని ప్రశ్నించారు. ముంబాయి ఛత్రపతి విమానాశ్రయం 1850 ఎకరాలు.. భోగాపురం 2200 ఎకరాలు.. మరి అమరావతికి 5 వేల ఎకరాలు ఎందుకు? బీజింగ్, లండన్‌లలో ఒలంపిక్స్ నిర్వహించే స్పోర్ట్స్ సిటీలు 150 ఎకరాల విస్తీర్ణమే. మరి అమరావతి స్పోర్ట్స్ సిటీకి 2500 ఎకరాలు ఎందుకు? గడిచిన 11 ఏళ్లలో ఒక్క పరిశ్రమ రాని అమరావతిలో స్మార్ట్ ఇండస్ట్రీల కోసం భూములు అంటే నమ్మశక్యమేనా? అని అనుమానం వ్యక్తం చేశారు.

రాజధాని భూములపై వెంటనే శ్వేతపత్రం ఇవ్వాలి. మలివిడత భూ సేకరణపై అనుమానాలను నివృత్తి చేయాలి. అఖిలపక్షాన్ని వెంటనే పిలవాలి. అమరావతి విశ్వనగరం అవ్వాలనేది మా ఆకాంక్ష. తొలివిడతలో సేకరించిన భూముల్లో రాజధాని కట్టకుండా మలి విడత భూములు ఇవ్వాలని, లేకుంటే మున్సిపాలిటీ అవుతుందని రైతులను బ్లాక్ మెయిల్ చేయడం దారుణం. ఇది భూములు ఇచ్చిన 29 వేల మంది రైతులను మోసం చేయడమే. రెండో విడత భూ సేకరణను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. రాజధానికి లక్ష కోట్ల అప్పులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అమరావతి నిర్మాణం కేంద్రం భాధ్యత. రాజధాని విభజన హామీ. స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రి రాష్ట్రానికి వస్తే, రాజధానికి సహాయం అడగాల్సిన పేరు శాలువాలు కప్పి, ఆహా ఓహో అని డప్పు కొడతారా ? అమరావతి పేరుతో చేసే అప్పులు జీవితాలలో తీరేవేనా? అని అడిగారు.

## నెల్లూరులో పెంచలయ్య హత్య కేసు... దర్యాప్తు వేగం పెంచిన పోలీసులు



ఏపీ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): నెల్లూరులో సంచలనం సృష్టించిన పెంచలయ్య హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం రాత్రి కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో కొందరు ముసుగుదారులు సీపీఎం ఆర్డీటీ కాలనీ శాఖ సభ్యుడు, ప్రజానాట్య మండలి కళాకారుడు పెంచలయ్య (38)పై దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనపై నెల్లూరు రూరల్ పోలీసులు విస్తృత దర్యాప్తు ప్రారంభించారు. శనివారం తెల్లవారుజామున నిందితులు కోవూరులోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద దాక్కున్నారన్న సమాచారం ఆధారంగా పోలీసులు అక్కడ ముట్టడి చేపట్టారు. అయితే పోలీసులు చేరుకోగానే నిందితులు కత్తులతో దాడికి దిగడంతో కానిస్టేబుల్ ఆదినారాయణ గాయపడ్డారు. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు ప్రతిదాడిగా కాల్పులు జరపగా నిందితుడు జేమ్స్ మోకాలిలో గాయపడి అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ జీజీహెచ్‌కు తరలించారు. ఇంకా పరారీలో ఉన్న తొమ్మిది మంది నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.

ఇదిలా ఉండగా, పెంచలయ్య హత్యకు గల కారణాలపై పోలీసులు కీలక సమాచారం వెలికితీశారు. కల్లూరుపల్లికి చెందిన అరవ కామాక్షమ్మ అనే మహిళ ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా గుర్తించినట్లు తెలుస్తోంది. గంజాయి రవాణా, చోరీలు, ఇతర నేరాలకు సంబంధించిన గ్యాంగ్‌ను ఆమె ఆధారపడి నడుపుతున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ అక్రమచర్యలను విమర్శిస్తూ, ఆపాలని పెంచలయ్య పలుమార్లు సూచించడంతోనే కామాక్షమ్మ అసహనం వ్యక్తం చేసి, తన గంజాయి గ్యాంగ్‌కు చెందిన తొమ్మిది మందితో కలిసి హత్య చేయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

దాడిలో పాల్గొన్న ముసుగుదారులు హత్యకు ముందే పెంచలయ్యను స్కూటీపై వెళ్తుండగా వెంబడించి అమానుషంగా దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. అరవ కామాక్షమ్మపై గతంలోనూ నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పెంచలయ్య హత్యతో కల్లూరుపల్లి ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా, నిందితుల అరెస్టు కోసం పోలీసులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలను మరింత వేగవంతం చేశారు.

## మీడియాతో ఇష్టాగోష్టి.. సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



ఏపీ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): కోస్తా, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. మీడియాతో ఆయన ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అటు రాజధాని విస్తరణ కోసం రైతులంతా ఒకే తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. రైతులందరూ ఒకే అసోసియేషన్ కిందకు రావాలని, జేఏసీగా ఏర్పడితే సమస్యలు పరిష్కరిస్తామని సూచించారు.

కేపిటల్ గెయిన్స్ మినహాయింపు ఇవ్వాలని కేంద్రాన్ని అడుగుతున్నామని, రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశామని చెప్పారు. అయితే కేంద్ర పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నిర్మలా సీతారామన్ చెప్పారని చంద్రబాబు వివరించారు. దశలవారీగా రాష్ట్ర సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అమరావతి రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో అవినీతి లేకుండా చేసేందుకు త్వరలో ఓ కార్యచరణ రూపొందిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మెజార్టీ స్థానాలు హస్తగతం..!

## సర్పంచు అభ్యర్థుల గెలుపు ఖాయం

## ఏకగ్రీవం అయితే రూ. 10 నుంచి 20లక్షలు

## నామినేషన్ల దాఖలలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



వికారాబాద్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను హస్తగతం చేసుకుంటామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం తాండూరు మండలం మల్కాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా జనార్దన్ రెడ్డి, సంగెంకలాన్ అభ్యర్థిగా భాగ్యలక్ష్మి, కొత్లాపూర్ అభ్యర్థిగా పట్లోళ్ల లతలు ఎన్నికల్లో వేసిన నామినేషన్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీ మద్దతు అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. వాటినే ఎన్నికల్లో అస్త్రాలుగా మారుతాయన్నారు. సర్పంచు ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ మద్దతు అభ్యర్థులు గెలుపొందడి ఖాయమన్నారు. ఏకగ్రీవ పంచాయతీలు అయితే రూ.10లక్షల నుంచి 20లక్షలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, డా. సంపత్ కుమార్, మాజీ సర్పంచ్ మేఘనాథ్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు రవి శిందే, రఘునాథ్ రెడ్డి, నాయకులు మద్దతుదారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ హరి హర సుతుడు అయ్యప్ప స్వామి వారి పుష్కర కన్య స్వామి మహా పడిపూజ కార్యక్రమం





కుత్బుల్లాపూర్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): జీడిమెట్ల విలేజ్ హనుమాన్ టెంపుల్ దగ్గర శ్రీరాంనగర్ కాలనీలో నంద్యాల మోహన్ గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ హరిహర సుతుడు అయ్యప్ప స్వామి వారి కన్య స్వామి మహా పడిపూజ భిక్ష మహోత్సవ ఆహ్వాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం ఆహ్వానించువారు కోట దుర్గారావు కత్తి స్వామి వారి సహకారంతో మహా పడిపూజ పౌరోహిత్ లు నాగ చంద్ర కోటేశ్వర శర్మ, కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ పులాభిషేకం,పాలాభిషేకం, నేయభిషేకం, ఇలా మహా పడిపూజ చేయడం నాకు చాలా సంతోషంగా ఉంది అని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు నంద్యాల మోహన్ గురుస్వామి, కోట దుర్గారావు కత్తి స్వామి, శీను గురుస్వామి, సాయినాథ్ గురుస్వామి, మాధవ గురుస్వామి, రాజేష్ గురుస్వామి, సురేష్ పేరు స్వామి, భాస్కర్ పెరు స్వామి, పుష్కర కన్య స్వామి, బట్టు రాజు గదా స్వామి, మహేష్ గదా స్వామి, సిహెచ్ మోహన్ గదా స్వామి, మణి కాంత్ గదా స్వామి,మమత శ్రీ గంటా స్వామి, శ్రీనివాస్ గంటా స్వామి, రఘు గంటా స్వామి, ఉపేంద్ర గంటా స్వామి, సుదీక్ష కత్తి స్వామి, నరసింహ కత్తి స్వామి, మణిదీప్ కత్తి స్వామి, ప్రనితి కన్య స్వామి,శ్రీనివాస్ కన్య స్వామి, అదేవిధంగా నంద్యాల మోహన్ గురుస్వామి శిష్య బృందం పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో భజన మండలి బాబు గురు స్వామి, బృందం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దీక్ష దివాస్ కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లిన కాలనీ ప్రజలు డివిజన్ అధ్యక్షులు పుష్పల భాస్కర్



కుత్బుల్లాపూర్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): సూరారం 129 డివిజన్ పరిధిలోని సబ్ స్టేషన్ దగ్గర నుండి దీక్షా దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం కి 129 సూరారం డివిజన్ నుండి డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు, భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో కెసిఆర్ అభిమానులు పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కాలనీ ప్రెసిడెంట్లు పలు సీనియర్ నాయకులు టిఆర్ఎస్ అభిమానులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ ఒకటిన సమాచార భవన్ ఎదుట జర్నలిస్టుల ధర్నా

## విజయవంతం చేయాలని టీడబ్ల్యూజేఎఫ్ పిలుపు



కుత్బుల్లాపూర్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ ఒకటిన "ఛలో సమాచార భవన్" హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమీషనరేట్(సమాచారభవన్) ఎదుట జర్నలిస్టుల ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. శనివారం ఆయన ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కో-కన్వీనర్లు వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, తన్నీరు శ్రీనివాస్ తదితరులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నప్పటికీ జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని, కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. ఇక జర్నలిస్టులకు ఇస్తామన్న ఇళ్లస్థలాల ఊసే లేదని, ఆరోగ్య భీమా పథకం అటకెక్కిందని, చిన్న మధ్య తరహా పత్రికలు సంక్షోభంలో పడ్డాయని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వమే తీరని అన్యాయం చేసిందంటే...ఈ ప్రభుత్వం కూడా మరింత అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామంటూ ముఖ్యమంత్రి, సమాచార శాఖ మంత్రి పలు మార్లు హామీలిచ్చారే తప్ప ఆచరణలో పెట్టలేదని, చివరికి జర్నలిస్టుల ప్రతినిధిగా ఉన్న మీడియా అకాడమీ ఛైర్మన్ కూడా కమిటీ పేరుతో కాలయాపన చేసి చివరికి చేతులెత్తేసినట్లు తెలుస్తోందని అన్నారు. సుప్రీకోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని, ఇది చాలా అన్యాయమని, మనసుంటే మార్గం ఉంటుందన్న ఆలోచనతో ప్రత్యామ్నాయ జీవో ద్వారా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల ఇవ్వొచ్చని అన్నారు.జర్నలిస్టుల సమస్యలలో ప్రధానమైన ఇండ్ల స్థలాలు, అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులతో పాటు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో ఉచిత విధ్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, మహిళా జర్నలిస్టులకు ప్రత్యేక సదుపాయాలు, చనిపోయిన జర్నలిస్టు కుటుంబానికి ప్రభుత్వం ఇస్తున్న లక్ష రూపాయల సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచడం తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకై డిసెంబర్ ఒకటిన తలపెట్టిన "ఛలో సమాచారభవన్" కార్యక్రమంలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవతం చేయాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు.

# జాతీయ న్యాయ సేవధికార చట్టంపై అవగాహన కార్యక్రమం మధుబాబు చికిలే



కుత్బుల్లాపూర్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): ప్రపంచ మానవ హక్కుల సమితి, బ్లూ క్రీసెంట్ సొసైటీ హక్కుల పక్షోత్సవాల్లలో నాలుగవ రోజు సూరారం డివిజన్, రాజీవ్ గాంధీ నగర్ లోని గీతాంజలి హై స్కూల్ లో జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగ ప్రవేశిక, సమాచార హక్కు చట్టం, జాతీయ న్యాయ సేవధికార చట్టం పై ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే అవగాహన కల్పించారు. మహిళలకు, పేదలకు, బాలలకు, కార్మికులకు ఉచిత న్యాయ సహాయం న్యాయ సేవధికార సంస్థలు అందిస్తాయి అన్నారు. ఉచిత న్యాయ సహాయం కొరకు 15100 కు సంప్రదించవచ్చు అని అన్నారు. అలాగే నైటింగేల్ అంధుల సాంస్కృతిక సంస్థ , సూరారం కాలనీ వారికి విద్యార్థులు యాజమాన్యం వారు పదిహేను వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ వ్యవస్థాపకులు తూటే విజయ్ కుమార్, పాఠశాల కరెస్పాండంట్ మహిపాల్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ కార్యక్రమానికి హాజరైన, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు



సూర్యాపేట/తుంగతుర్తి, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): తుంగతుర్తి, గ్రామపంచాయతీ భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థిగా మల్లెపాక సాయిబాబా మరియు వార్డు సభ్యుల నామినేషన్ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు సంకినేని వెంకటేశ్వరరావు, బిజెపి రాష్ట్ర నాయకులు సంకినేని రవీందర్ రావు, సంకినేని వరుణ్ రావు, హాజరయ్యారు. ఈ సందర్భంగా తుంగతుర్తి గ్రామ ప్రజలు, గ్రామ బి.జె.పి నాయకులు, కార్యకర్తలు, సంకినేని అభిమానులు నామినేషన్ ర్యాలీలో భారీ, ఎత్తున పాల్గొని భారతీయ జనతా పార్టీ అభ్యర్థికి మద్దతు తెలపడం జరిగింది.

# పామిరెడ్డిపల్లి గ్రామ సంక్షేమానికి బాటలు వేస్తాం

## పామిరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి మధిర మంజుల శ్రీశైలం





వనపర్తి , 29 నవంబర్ (క్రాంతి న్యూస్): పామిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా మధిర మంజుల శ్రీశైలంలు శనివారం కాంగ్రెస్ కార్యకర్తలతో భారీ ఊరేగింపు డప్పుల శబ్దంతో ర్యాలీతో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.వారు మాట్లాడుతూ...ప్రజల సంక్షేమనికి ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ది పొందే అవకాశం ఉన్న ప్రతి ఒక్కరికి సహాయ పడతానని గ్రామ అభివృద్ధికి అన్ని వేళాల కృషి చేస్తానని అందరికీ అందుబాటులో ఉంటూ పనిచేస్తానని స్థానిక ఎమ్మెల్యే మెగారెడ్డి సహాయంతో గ్రామని అభివృద్ధి చేస్తానని అన్నారు.మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దయ్య,మాజీ ఎంపీటీసీ ఇందిరా,లక్ష్మారెడ్డి,చిట్యాల సుదర్శన్ రెడ్డి,మన్యపురెడ్డి, మధుర తిక్కన, రాఘవేందర్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 3న జరిగే మహా ధర్నా ను జయప్రదం చేయండి



కూకట్ పల్లి, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): జర్నలిస్టుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే ప్రభుత్వంతో పోరాటం చేస్తుందని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు అన్నారు. కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నంబర్ 1లోని మహాత్మగాంధి విగ్రహం వద్ద నిర్వహించిన జర్నలిస్ట్ మహా ధర్నా కర పత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మామిడాల రవీందర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాడిన తరువాత అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, గత రెండు ఏళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో జర్నలిస్టులను మచ్చిక చేసుకోవడానికి కల్లబొల్లి కబుర్లు చెబుతూ ఎన్నికల అనంతరం పట్టించుకున్న పాపాన పోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇస్తామని ప్రకటించిన విధంగా జర్నలిస్టులకు అందవలసి హక్కులను, సంక్షేమ ఫలాలను అందించేలా చూడలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు రావలసిన హక్కుల కోసం డిసెంబర్ 3వ తేదిన సమాచార శాఖ కార్యాలయం ముందు పెద్ద మొత్తంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపరు. జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలను ప్రభుత్వం వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా క్రమశిక్షణ కమిటి కన్వీనర్ పరమేష్, కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ఏ. కరీమ్, జిల్లా నాయకుడు పి. గంగరాజు, సామాల రాము, చంద్రకుమార్, హరిబాబు, కావురి ప్రవీణ్, సాగర్ రెడ్డి, రాజు, వెంకటేష్, రాకేష్, హరి, అంబటి వెంకట్, హరికృష్ణా, ఆనంద్, చంద్రకాంత్ రెడ్డి, శ్రీకాంత్, పవన్ .మారుతి సాగర్, సోమిరెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల క్రీడ, పోటీలను నిర్వహించిన జిల్లా సంక్షేమ శాఖ



సూర్యాపేట, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): అంతర్జాతీయ క్రీడ దినోత్సవాన్ని, పురస్కరించుకుని, మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి కె.నరసింహ రావు, అధ్యక్షతన, శనివారం నాడు జిల్లాలో దివ్యాంగులకు క్రీడా, పోటీలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగులు క్రీడల ఆటలు ఆడుతూ స్పోర్ట్స్ ద్వారా దివ్యాంగులలో, మానసిక ఉల్లాసం, మనోధైర్యం కలుగుతుందన్నారు , అనంతరం జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు.దివ్యాంగులు క్యారం బోర్డ్, చెస్, పరుగుపందెం,షార్ట్ పుట్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి డిసెంబర్ 3న జరిగే జిల్లా స్థాయి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో, బహుమతులు ప్రధానం చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి వెంకట రమణ, డి.ఈ.వో అశోక్ ,జిల్లా యూత్, స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి,సి.డీ.పీ.వో , సూపర్ వైజర్స్,కార్యాలయ సిబ్బంది,దివ్యాంగుల సంఘాల అధ్యక్షులు, నాయకులు , అపూర్వ పాఠశాల ఉఫాద్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల రిస్క్.. బొప్పాయి తింటే ఆ సమస్యలన్నీ పరార్!



స్పోర్ట్స్ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): మిగతా సీజన్లతో పోలిస్తే చలికాలంలో భిన్నమైన వాతావరణం ఉంటుంది. ముఖ్యంగా చలి గాలులు వీయడం వల్ల జలుబు, గొంతునొప్పి, కండరాలనొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఇక దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు కూడా సంభవిస్తుంటాయి. అయితే ఏ వ్యాధులైనా ముందుగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపైనే దాడిచేస్తుంటాయి. కాబట్టి సీజనల్ వ్యాధుల బారిన, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే శరీరంలో తగిన ఇమ్యూనిటీ పవర్ అవసరం. అది బొప్పాయి తినడం ద్వారా కూడా లభిస్తుందని, ముఖ్యంగా చలికాలంలో సీజనల్ వ్యాధుల నుంచి సంరక్షణకు ఔషధంలా పనిచేస్తుందని పోషకాహార నిపుణులు, ఆయుర్వేదిక్ వైద్య నిపుణులు అంటున్నారు. ఇంకా ఏయే బెనిఫిట్స్ ఉంటాయో ఇప్పుడు చూద్దాం.

బొప్పాయి లో సహజంగానే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. దీంతోపాటు విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. పండులోనే కాకుండా కాయలో, ఆకుల్లో కూడా ఇవి ఉంటాయి. అయితే చల్లటి వాతావరణంలో బొప్పాయిని తినడంవల్ల శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయపడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. ముఖ్యంగా డెంగ్యూ పేషెంట్లకు ఔషధంలా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే రోగ నిరోధక శక్తిని పెంచడం ద్వారా ప్లేట్ లెట్స్ పడిపోకుండా కాపాడుతుంది. అలాగే లివర్ సమస్యలను, యాసిడ్ రిఫ్లెక్స్ సమస్యలను సైతం నివారిస్తుంది. ఎసిడిటీని, కడుపులో ఉబ్బరాన్ని, అజీర్తిని తగ్గించడంల సహాయపడుతుంది. ఫైబర్ కంటెంట్ అధికంగా ఉండటంవల్ల అధిక అధిక బరువును, శరీరంలో హానికారక కొవ్వును తగ్గించడంలోనూ కీ రోల్ పోషిస్తుంది. డెంగ్యూ బాధితులు బొప్పాయి ఆకుల రసాన్ని తాగితే పడిపోయిన ప్లేట్‌లెట్స్ సంఖ్య కూడా పెరుగుతుందని ఆయుర్వేదిక్ ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## పుచ్చ కాయ తిని గింజలు పారేస్తున్నారా.. వీటితో ఎన్ని లాభాలంటే.



స్పోర్ట్స్ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): మనకు తెలుసు-పండ్లు మన ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తాయి. అలాగే కొన్ని పండ్ల విత్తనాలు కూడా మన శరీరానికి ఆశ్చర్యకరమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పుచ్చకాయ గింజలు పోషకాల సమృద్ధితో ప్రత్యేక స్థానం సంపాదించాయి.

పుచ్చకాయ గింజల్లో ప్రోటీన్, విటమిన్-బి, మెగ్నీషియం, ఫాస్ఫరస్, పొటాషియం, జింక్ వంటి కీలక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, ఒమేగా-3,ఒమేగా-6 ఫ్యాటీ ఆమ్లాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అంతేకాదు, గింజల్లోని యాంటీఆక్సిడెంట్లు మరియు ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మాన్ని రక్షించి మెరుగు పరచడంలో సహాయపడతాయి.

అదనంగా, పుచ్చకాయ గింజల్లో ఎక్కువ మోతాదులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే మెగ్నీషియం మరియు ప్రోటీన్ కలిసి రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతాయి.

పుచ్చకాయ గింజలు శరీరానికి శక్తిని అందించి, యాక్టివ్‌గా ఉండేందుకు దోహదం చేస్తాయి. వీటిలో కేలరీలు తక్కువగా ఉండడంతో బరువు తగ్గాలనుకునేవారికి కూడా ఇవి మంచి ఎంపికగా భావిస్తారు. అంతేకాకుండా, గింజల్లోని పోషకాలు రోగనిరోధకశక్తిని పెంచి శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడతాయి.

పై సమాచారం ఇంటర్నెట్‌లో లభ్యమైన వివిధ వనరుల ఆధారంగా అందించబడింది. కాబట్టి పుచ్చకాయ గింజలు లేదా ఇతర ఆరోగ్య సంబంధిత అంశాలను ఆచరణలో పెట్టే ముందు తప్పనిసరిగా ఆరోగ్య నిపుణులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

## చలికాలంలో చర్మ సంరక్షణ.. స్కిన్ టైప్‌ను బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..!

స్పోర్ట్స్ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): చలికాలంలో చాలామంది ఎదుర్కొనే వాటిలో చర్మ సమస్యలు ఒకటి. కాబట్టి జాగ్రత్తగా చూసుకోవడం, శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం మీ చర్మ రకాలపైన అవగాహన అవసరం అంటున్నారు చర్మ వ్యాధి నిపుణులు. ఎందుకంటే ఒక్కో టైప్ రకానికి ఒక్కో విధమైన సంరక్షణ పద్ధతులు, ఉత్పత్తులు అవసరం అవుతుంటాయి. అంతేకాకుండా అందం, ఆరోగ్యం వంటి విషయాలపట్ల యువతలో ఆసక్తి బాగా పెరుగుతోంది. ఉన్నంతలో అట్రాక్టివ్‌గా కనిపించాలని అందరూ భావిస్తున్నారు. అయితే మీ స్కిన్ టైప్ గురించి అవగాహన కలిగి ఉన్నప్పుడే అది సాధ్యం అవుతుంది అంటున్నారు డెర్మటాలజిస్టులు. అయితే చర్మ రకాలు ఎన్ని? ఎలా ఏర్పడతాయి? దేనికి ఎలాంటి కేర్ అవసరమో చూద్దాం.

స్కిన్ టైప్ అంటే?

ఒక్కో వ్యక్తి ఒక్కో రకమైన చర్మ తత్వాన్ని లేదా రకాన్ని కలిగి ఉంటారు. ఆయా వ్యక్తుల జీవన శైలులతోపాటు జన్యుశాస్త్రం, ఏజ్, హార్మోన్లు, ఒత్తిడి, ఆహారం, యాక్టివిటీస్ లెవల్స్, ఎన్విరాన్ మెంటల్ ఫ్యాక్టర్స్ వంటివి ఇందులో కీలకపాత్ర పోషిస్తాయని అమెరికన్ అకాడమీ ఆఫ్ డెర్మటాలజీ అధ్యయనం పేర్కొంటున్నది. దీని ప్రకారం.. పొడి చర్మం , జిడ్డు చర్మం, నార్మల్ స్కిన్, కాంబినేషన్ లేదా సెన్సిటివ్ స్కిన్.. ఇలా మొత్తం 5 రకాలు ఉన్నాయి.

పొడి చర్మం

బాడీలో తగినంత సెబమ్ ఉత్పత్తి కానప్పుడు సెబాషియన్ గ్రంథుల ద్వారా కొన్ని జిడ్డు పదార్థాలు తక్కువగా ప్రొడ్యూస్ అవుతాయి. దీనిని బట్టి మీది డ్రై స్కిన్ టైప్ అంటున్నారు నిపుణులు. నిజానికిది స్మాల్ ఫంగల్ వల్ల ఏర్పడుతుంది. కొన్నిసార్లు ఇన్ఫెక్షన్లు సోకితే ముక్కు, కనుబొమ్మల చుట్టూ దద్దుర్లకు కారణం అవుతుంది. కాబట్టి ఇలాంటి చర్మ రకం ఉన్నప్పుడు సంరక్షణ కోసం తేమగా ఉంచుకోవడం ముఖ్యం. అందుకోసం ఒక సున్నితమైన క్లెన్సర్ అండ్ హ్యూమెక్టెంట్స్ కలిగి ఉండే మాయిశ్చరైజర్‌ని ఎంచుకోవాలంటున్నారు నిపుణులు.

ఆయిలీ స్కిన్

జిడ్డు చర్మం లేదా ఆయిలీ స్కిన్ టైప్ కలిగి ఉన్నట్లయితే సెబమ్ (జిడ్డు) అధికంగా ఉత్పత్తి



అవుతుంది. దీనివల్ల స్వేద రంధ్రాలు విస్తరిస్తాయి. అలాగే ఇది మెరుస్తున్న జిడ్డు చర్మానికి దారితీస్తుంది. కొన్నిసార్లు స్వేద రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు ఏర్పడి సమస్యగా మారతుంటాయి. ఇలాంటి చర్మ సంరక్షణ కోసం బెంజాయిల్ పెరాక్సైడ్ లేదా సాలిసిలిక్ యాసిడ్ ఉన్న ఫేషియల్ క్లెన్సర్‌ను యూజ్ చేయడం ముఖ్యం. అలాగే "నాన్ కామెడోజెనిక్" స్కిన్ కేర్ ప్రొడక్ట్స్ కోసం కూడా ప్రయత్నించవచ్చు. మరొక విషయం ఏంటంటే.. జిడ్డు చర్మ రకం ఉన్నవారు వ్యాయామాలు చేసిన తర్వాత వెంటనే తలస్నానం చేయడం వల్ల మొటిమలు, దద్దుర్లు వంటివి రాకుండా ఉంటాయి.

కాంబినేషన్ స్కిన్

కొన్నిసార్లు డ్రైగా, కొన్ని సార్లు ఆయిలీగా ఉండే కాంబినేషన్ స్కిన్ టైప్ కలిగి ఉన్నట్లయితే.. మీ ఫేస్ ఏరియాలు డిఫరెంట్ స్కిన్ టైప్స్‌ను ప్రదర్శిస్తుంటాయి. ఇలాంటప్పుడు తదనుగుణంగా కేర్ తీసుకోవడం ముఖ్యం. అవసరమైనప్పుడు ట్రీట్మెంట్ చేయాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ చర్మ తత్వాన్ని కలిగి ఉన్నప్పుడు దానికి తగిన ప్రొడక్ట్స్ విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా మీరు కొనుగోలు చేసే ఉత్పత్తుల లేబుల్స్ తప్పక చెక్ చేయండి. ప్రతీ ఐటమ్‌లో మీ స్కిన్ టైప్‌ను టార్గెట్ చేసుకొని వివిధ పదార్థాలు ఉంటాయి. ఏది బెటరో అది ఎంచుకోండి.

సాధారణ చర్మ రకం


సాధారణ చర్మ రకం కలిగి ఉండటం మంచి విషయంగా భావిస్తుంటారు. ఎందుకంటే.. ఇలాంటి చర్మంపై డ్రై ఏరియాస్ గానీ, ఆయిలీ ఏరియాస్ గానీ ఉండవు. మీ స్కిన్ మొటిమలు లేదా సెన్సిటివిటీస్‌కు గురయ్యే అవకాశం తక్కువ. ఇక సంరక్షణ విషయానికి వస్తే దీనికి బేసిక్ స్కిన్ కేర్ రొటీన్ అవసరం. ప్రతి రోజూ ముఖాన్ని శుభ్రంగా కడుక్కోవడం, రాత్రిపూట మాయిశ్చరైజర్‌ని ఉపయోగించడం వంటివి చేస్తే సరిపోతుంది.

సున్నితమైన చర్మం

సెన్సిటివ్ స్కిన్ కలిగి ఉన్నవారు ఫేస్ కోసం ఉపయోగించే ప్రొడక్ట్స్ రకాలతో జాగ్రత్తగా ఉండాలంటున్నారు నిపుణులు. ఈ సందర్భంలో మీకు అంతర్లీనంగా తామర, రోసేసియా లేదా అలెర్జీ కాంటాక్ట్ డెర్మటైటిస్ వంటివి ఉంటే మరింత కేర్ తీసుకోవాలి. ఎంతకైనా మంచిది డెర్మటాలజిస్టులను సంప్రదించాలి. సున్నితమైన చర్మ రకం కొన్నిసార్లు పొడిగా, మరి కొన్నిసార్లు జిడ్డుగా, ఇంకొన్నిసార్లు కాంబినేషన్‌గానూ ఉండవచ్చు. సంరక్షణ విషయానికి వస్తే రంగులు, సువాసనలు, బెంజాయిల్ పెరాక్సైడ్ లేదా సాలిసిలిక్ యాసిడ్ వంటి కఠినమైన పదార్థాలతో కూడిన ఉత్పత్తులను నివారించాలి.

కాన్ఫిడెన్స్ ముఖ్యం !

కొందరు తమ స్కిన్ టైప్ గురించి ఆందోళన చెందుతుంటారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో చర్మ సంరక్షణకు సంబంధించిన రకరకాల కంటెంట్, స్కిన్ కేర్ రొటీన్స్ చూస్తున్నప్పుడు ఇబ్బంది పడుతుంటారు. అవసరమైన ప్రొడక్ట్స్ ఎంచుకోవాల్సి వచ్చినప్పుడు ఏది సెలెక్ట్ చేసుకోవాలో అనుమాన పడుతుంటారు. అయితే మీ స్కిన్ కలర్ ఏదైనా, దాని రకం గురించి తెలిసి ఉన్నప్పుడు, మీ స్కిన్ మీద మీకు ప్రేమ, శ్రద్ధ ఉన్నప్పుడు ఆందోళన అవసరం లేదు. ఎలా ఉండాలో, ఎలా సంరక్షించుకోవాలో అనే విషయంలో ఆత్మ విశ్వాసంతో ఉండండి. కాబట్టి క్వాలిటీ స్లీప్, హైడ్రేషన్, వ్యాయామం, స్ట్రెస్ మేనేజ్ మెంట్ వంటి అంశాలు మీ స్కిన్ టైప్ అండ్ ఓవరాల్ స్కిన్ హెల్త్‌ను ప్రభావితం చేస్తాయి. కాబట్టి అందుకు అనుగుణంగా జీవన శైలిని అలవర్చుకోండి.



క్రాంతి
ఆదివారం 30 నవంబర్ 2025

# క్రీడలు

epaper.krtvnews.com



# క్రికెట్ లవర్స్‌కు పండుగలాంటి వార్త..

## WPL-2026 షెడ్యూల్ విడుదల




స్పోర్ట్స్ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహిళల ప్రీమియర్ లీగ్ (WPL)-2026 పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. 2026 జనవరి 9న నవీ ముంబైలో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తో టోర్నీ అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌ను నవంబర్ 27న జరిగిన మెగా వేలంలోనే WPL చైర్మన్ జయేష్ జార్జ్ ముందుగా ప్రకటించిన తేదీలకు అనుగుణంగానే విడుదల చేశారు. 28 రోజుల్లో రెండు వేదికల్లో మొత్తం 22 మ్యాచ్‌లు జరగనున్నాయి.

| MATCH NO | DAY | DAY | DATE | TIME | HOME TEAM | AWAY TEAM | VENUE |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 1 | Fri | 9-Jan-26 | Evening | Mumbai Indians | Royal Challengers Bengaluru | Navi Mumbai |
| 2 | 2 | Sat | 10-Jan-26 | Afternoon | UP Warriorz | Gujarat Giants | Navi Mumbai |
| 3 | 2 | Sat | 10-Jan-26 | Evening | Mumbai Indians | Delhi Capitals | Navi Mumbai |
| 4 | 3 | Sun | 11-Jan-26 | Evening | Delhi Capitals | Gujarat Giants | Navi Mumbai |
| 5 | 4 | Mon | 12-Jan-26 | Evening | Royal Challengers Bengaluru | UP Warriorz | Navi Mumbai |
| 6 | 5 | Tue | 13-Jan-26 | Evening | Mumbai Indians | Gujarat Giants | Navi Mumbai |
| 7 | 6 | Wed | 14-Jan-26 | Evening | UP Warriorz | Delhi Capitals | Navi Mumbai |
| 8 | 7 | Thu | 15-Jan-26 | Evening | Mumbai Indians | UP Warriorz | Navi Mumbai |
| 9 | 8 | Fri | 16-Jan-26 | Evening | Royal Challengers Bengaluru | Gujarat Giants | Navi Mumbai |
| 10 | 9 | Sat | 17-Jan-26 | Afternoon | UP Warriorz | Mumbai Indians | Navi Mumbai |
| 11 | 9 | Sat | 17-Jan-26 | Evening | Delhi Capitals | Royal Challengers Bengaluru | Navi Mumbai |
| | 10 | Sun | 18-Jan-26 | - | - | - | - |
| 12 | 11 | Mon | 19-Jan-26 | Evening | Gujarat Giants | Royal Challengers Bengaluru | Vadodara |
| 13 | 12 | Tue | 20-Jan-26 | Evening | Delhi Capitals | Mumbai Indians | Vadodara |
| | 13 | Wed | 21-Jan-26 | - | - | - | - |
| 14 | 14 | Thu | 22-Jan-26 | Evening | Gujarat Giants | UP Warriorz | Vadodara |
| | 15 | Fri | 23-Jan-26 | - | - | - | - |
| 15 | 16 | Sat | 24-Jan-26 | Evening | Royal Challengers Bengaluru | Delhi Capitals | Vadodara |
| | 17 | Sun | 25-Jan-26 | - | - | - | - |
| 16 | 18 | Mon | 26-Jan-26 | Evening | Royal Challengers Bengaluru | Mumbai Indians | Vadodara |
| 17 | 19 | Tue | 27-Jan-26 | Evening | Gujarat Giants | Delhi Capitals | Vadodara |
| | 20 | Wed | 28-Jan-26 | - | - | - | - |
| 18 | 21 | Thu | 29-Jan-26 | Evening | UP Warriorz | Royal Challengers Bengaluru | Vadodara |
| 19 | 22 | Fri | 30-Jan-26 | Evening | Gujarat Giants | Mumbai Indians | Vadodara |
| | 23 | Sat | 31-Jan-26 | - | - | - | - |
| 20 | 24 | Sun | 1-Feb-26 | Evening | Delhi Capitals | UP Warriorz | Vadodara |
| | 25 | Mon | 2-Feb-26 | - | - | - | - |
| 21 | 26 | Tue | 3-Feb-26 | Evening | Eliminator | | Vadodara |
| | 27 | Wed | 4-Feb-26 | - | | | - |
| 22 | 28 | Thu | 5-Feb-26 | Evening | Final | | Vadodara |

ఇక ఫస్ట్ ఫేజ్ మ్యాచ్‌లు జనవరి 9 నుంచి 17 వరకు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో, సెకండ్ ఫేజ్ మ్యాచ్‌లు ఫైనల్‌తో పాటు ఎలిమినేటర్ మ్యాచ్‌లు జనవరి 19 నుంచి ఫిబ్రవరి 5 వరకు వడోదరలోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనున్నాయి. ఇటీవల జరిగిన WPL మెగా వేలంలో మొత్తం 277 మంది క్రీడాకారిణులు రిజిస్టర్ చేసుకోగా, అందులో కేవలం 67 మంది మాత్రమే అమ్ముడయ్యారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్, దీప్తి శర్మ వంటి స్టార్లు భారీ ధర పలికారు. కాగా, ఈ టోర్నీని జనవరి-ఫిబ్రవరిలోనే నిర్వహించడంతో ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న పురుషుల టీ20 వరల్డ్ కప్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా జరుగనుంది. WPL-2026 టికెట్లు, లైవ్ టెలికాస్ట్‌కు సంబంధించిన వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని బీసీసీఐ స్పష్టం చేసింది.

## బుమ్రా వన్డేలపై దృష్టి పెడితే బెటర్.. రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర కామెంట్స్



స్పోర్ట్స్ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): జస్ప్రీత్ బుమ్రా టెస్టుల కంటే వన్డేలపై దృష్టి పెడితే మంచిదని భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సొంత యూట్యూబ్ ఛానల్‌లో ఆయన మాట్లాడుతూ.. బుమ్రా ఇకపై టెస్టు క్రికెట్‌లో క్రమంగా ఆడకూడదని, ప్రధానంగా వన్డేలు, టీ20లు మాత్రమే ఆడాలని సూటిగా సలహా ఇచ్చాడు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ పర్యటనల అనంతరం బుమ్రా వరుసగా భారీ వర్క్‌లోడ్ మోస్తున్నాడని చెప్పుకొచ్చాడు. 31 ఏళ్లు నిండిన అతడు ఇటీవల కాస్త ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్నాడని కామెంట్ చేశాడు. దక్షిణాఫ్రికాతో 2 టెస్టుల్లో 8 వికెట్లు, వెస్టిండీస్‌తో 2 టెస్టుల్లో 7 వికెట్లు తీశాడని, ఆస్ట్రేలియాతో జరిగిన 5 టీ20ల సిరీస్‌లో కేవలం 3 వికెట్లు మాత్రమే తీశాడని గుర్తు చేశాడు. విశ్రాంతి కోసం వన్డేలు ఆడలేదని, డిసెంబర్ 9 నుంచి దక్షిణాఫ్రికాతో మరో 5 టీ20ల సిరీస్ ఉన్న నేపథ్యంలో అతడి ఫామ్‌పై ఆందోళన వ్యక్తం చేశాడు. భారత జట్టు తదుపరి టెస్టు ఆడేది 2026 జులై వరకు లేదని అశ్విన్ తెలిపాడు. కానీ, బుమ్రాకు టెస్టు క్రికెట్ ఎంతో ఇష్టమని, ఎంతవరకైనా ఆడాలని ఉంటుందన్నారు. అది భవిష్యత్తులో పెద్ద సవాలుగా మారుతుందని అన్నారు.

భారత క్రికెట్ కోసం, బుమ్రా కెరీర్ కోసం తాను అతడిని టీ20ల్లోనే చూడాలనుకుంటున్నానని అన్నాడు. అర్థం లేని వన్డేలు ఆడొద్దని.. కీలకమైన టెస్టులు మాత్రమే ఆడాలని అడ్వైస్ ఇచ్చాడు. జస్ప్రీత్ బుమ్రా భారత్‌కు అపురూపమైన ఆస్తి అని.. అతడి యాక్షన్ ఏదైనా బ్యాటర్‌కు చుక్కలు చూపిస్తుంది కానీ, అదే యాక్షన్ అతని శరీరానికి భారీ ఒత్తిడి తెస్తుందని అన్నారు. మరోవైపు బుమ్రా యాక్షన్ అసాధారణమని, హైపర్ ఎక్స్‌టెన్షన్, తక్కువ రిలీజ్ పాయింట్ ఉండటం వల్ల బంతిని ఎదుర్కొనే బ్యాటర్లకు కష్టమైనా.. అతడి వీపు, హిప్, లోయర్ బాడీకి భారీ ఒత్తిడి పెడుతుందని క్రికెట్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.

# రోహిత్, విరాట్ లకు 2027 ప్రపంచ కప్ డెస్టినీ పరీక్ష




స్పోర్ట్స్ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): భారత క్రికెట్ జట్టులో దిగ్గజాలు అయిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు తమ క్రికెట్ భవిష్యత్తుపై వారి అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో 2027 వన్డే ప్రపంచ కప్ అవకాశాలను నిర్ణయించే అత్యంత కీలకమైన 'ఆడిషన్' నేటి నుంచి ప్రారంభం కానుంది. వన్డే జట్టులో అత్యంత బలంగా ఉన్న దక్షిణాఫ్రికాతో జరిగే మూడు వన్డేల సిరీస్ లో భారత్ తలపడనుండగా, ఈ సిరీస్ ద్వారా జాతీయ జట్టులో ఉన్న కొన్ని ఎంపికల గందరగోళాన్ని పరిష్కరించాలని టీమిండియా చూస్తోంది.

ఆధునిక క్రికెట్‌లో లెజెండ్‌లుగా వెలుగొందుతున్న రోహిత్, విరాట్ కోహ్లీ ఇద్దరూ ప్రస్తుతం కేవలం వన్డే ఒక్క ఫార్మాట్‌లో మాత్రమే అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నారు. రాబోయే రెండు నెలల్లో భారత్ కేవలం ఆరు వన్డేలు (దక్షిణాఫ్రికా మూడు, జనవరిలో న్యూజిలాండ్‌పై మూడు) మాత్రమే ఆడనుంది. ఈ నేపథ్యంలో, ఈ ఆరు వన్డేల్లో వారి ప్రదర్శన 2027 ప్రపంచ కప్ రోహిత్, కోహ్లీల భవితవ్యాన్ని నేరుగా ప్రభావితం చేయనుంది. ఈ ప్రదర్శనలు వారి కెరీర్‌లను పొడిగించగలవు. అలాగే వారి కెరీర్‌ను అనివార్యమైన ముగింపు (సన్‌సెట్) వైపు నెట్టగలవు. ఈ సిరీస్ ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లకు అత్యంత కీలకమైన పరీక్షగా మారనుంది.

ఇదిలా ఉంటే ఈ మూడు వన్డేల సిరీస్ తో పాటు 2027 వన్డే ప్రపంచ కప్ లక్ష్యంగా రోహిత్ శర్, విరాట్ కోహ్లీలు నెట్ ప్రాక్టీస్ చేస్తున్నారు. ముఖ్యంగా రోహిత్ శర్మ పూర్తి ఫిట్ నెస్ సాధించి పదేళ్ల క్రితం ఎలా ఉన్నాడో అలా స్లిమ్ గా అయ్యాడు. మరోపక్క విరాట్ కోహ్లీ కూడా పూర్తి ఫిట్ గా ఉన్నాడు. కానీ ఇటీవల జరిగిన వన్డే మ్యాచులో వారి ప్రదర్శన ఆశించినంతగా లేకపోవడంతో ఫ్యాన్స్ నిరాశ చెందారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి జరగనున్న వన్డే సిరీస్ పై రోహిత్, కోహ్లీల అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

## ఆర్సీబీ ఒక్కటే కాదు, ఐపీఎల్‌లో అమ్మకానికి మరో జట్టు!




స్పోర్ట్స్ న్యూస్, 29 నవంబర్ (క్రాంతి న్యూస్): దిశ, వెబ్ డెస్క్: ఐపీఎల్ 2026 టోర్నమెంట్ ప్రారంభాని కంటే ముందు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును అమ్మేసేందుకు యాజమాన్యం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. 2026 మార్చి 31 సమయానికి ఆర్సీబీ జట్టుకు కొత్త ఓనర్ కూడా రాబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో మరో షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ఆర్సీబీ ఒక్కటే కాదు, ఐపీఎల్ లో ఉన్న మరో జట్టును కూడా అమ్మకానికి పెట్టినట్లు సమాచారం అందుతోంది. రాజస్థాన్ రాయల్స్ జట్టును అమ్మకానికి పెట్టినట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రముఖ బిజినెస్ మాన్ హర్ష్ గోయెంకా కూడా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టి తెలిపారు.

ఐపీఎల్ లో ఒకటి కాదు, రెండు జట్లు అమ్మకానికి ఉన్నాయి అంటూ హర్ష్ గోయెంకా వెల్లడించారు. రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండు జట్లను అమ్మేస్తున్నారు.. ఈ రెండు జట్లను కొనుగోలు చేసేందుకు ఐదుగురు బడా వ్యాపారవేత్తలు రేసులో ఉన్నట్లు సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టారు. అహ్మదాబాద్, ముంబై, బెంగళూరు, పూణే నగరాల నుంచి కొత్త ఓనర్లు వస్తారు కావచ్చు అంటూ అంచనా వేశారు హర్ష్ గోయెంకా. ఈ పోస్ట్ ఇపుడు వైరల్ గా మారింది.

ఇది ఇలా ఉండగా ఐపీఎల్ 2026 టోర్నమెంట్ కు సంబంధించిన మినీ వేలం డిసెంబర్ 16వ తేదీన జరగనుంది. ఈ ఈవెంట్ ను ముందుగా ముంబైలో నిర్వహించాలని ప్లాన్ చేశారు. కానీ కొన్ని అనివార్య కారణాలవల్ల ముంబై నుంచి అబుదాబీకి షిఫ్ట్ చేసింది బీసీసీఐ. ఇక ఐపీఎల్ 2026 టోర్నమెంటును, మార్చిలో ప్రారంభించబోతున్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ ఫినిష్ కాగానే ఈ ఐపీఎల్ 2026 ప్రారంభమవుతుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం మార్చి 15వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు ఐపీఎల్ 2026 మెగా టోర్నమెంట్ జరగనుంది.

# ప్రభాస్ 'స్పిరిట్'లో కాజోల్ దేవగణ్.?



పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రీ ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.


# వెయిట్ లాస్ డ్రగ్స్ యూజ్ చేసిన తమన్నా?



మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా హీరోయిన్‌గా బిజీగా ఉండటం పక్కన పెడితే ఐటెమ్ సాంగ్స్‌తో బిజీ అయిపోయింది. కాస్త బోల్డ్‌గానే కనిపిస్తుంది. అయితే ఈ విషయంలో ఎంత మంది ఎన్నిరకాలుగా కామెంట్ చేసిన తను మాత్రం మౌనంగానే ఉంది. కానీ తన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు కారణం వెయిట్ లాస్ డ్రగ్స్ యూజ్ చేయడమేనన్న విషయంపై ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చింది.

'నా బాడీ కర్వ్స్ నేచురల్. నాలో పార్ట్ అవి. నేను సింధి. హిప్, వెస్ట్ ఎక్కడికి పోవు. కారణం బోన్ స్ట్రక్చర్ అలా ఉంటుంది. కొవిడ్ తర్వాత బాడీ చేంజ్ అయింది. అంతేకాదు స్త్రీలలో ఏజ్, హార్మోన్స్ కారణంగా శరీరంలో మార్పులు వస్తాయి. నేను వెస్టర్న్ బ్యూటీ స్టాండర్స్‌ను ఫాలో కాను. ఇండియన్‌గా ఉండటమే అందం. జనాలు మన కర్వ్స్ లవ్ చేస్తారు. ఇతరులను చూసి పర్ఫెక్ట్‌గా ఉండాలనే ఆలోచనలో పడిపోకుండా ఉండటమే బెస్ట్' అని చెప్పింది తమన్నా.

# రాజమౌళి -మహేశ్ బాబు సినిమా టైటిల్ వివాదం క్లియర్.?




ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న క్రేజీ ప్రాజెక్ట్ 'వారణాసి' పై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. 2027లో రాబోతున్న ఈ సినిమా కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించినప్పటి నుంచి సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' అనే టైటిల్‌ను తెలుగులో గతంలోనే వేరే నిర్మాణ సంస్థ రిజిస్టర్ చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా ఈ టైటిల్ వివాదం పరిష్కారమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. వేరే నిర్మాణ సంస్థ కేవలం తెలుగులో మాత్రమే ఈ టైటిల్‌ను రిజిస్టర్ చేసుకోవడంతో, చిత్ర బృందం (రాజమౌళి టీమ్) తెలుగు వెర్షన్ టైటిల్‌లో స్వల్ప మార్పు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ సినిమా పలు భాషల్లో విడుదల కానున్నందున, తెలుగులో మాత్రం 'రాజమౌళి వారణాసి' అనే పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఇతర అన్ని భాషల్లో మాత్రం 'వారణాసి' అనే ఒరిజినల్ టైటిల్‌నే కొనసాగించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై చిత్ర యూనిట్ త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ఖలేజా సినిమా టైంలో కూడా ఇలా టైటిల్ వివాదం ఎదుర్కోగా.. మేకర్స్ ఆలోచించి మహేశ్ ఖలేజా అనే పేరుతో విడుదల చేయగా.. వివాదం సద్దమణిగింది.

# నాన్న చేసిన ఆలస్యమే నన్ను హీరోయిన్ చేసింది.. లేదంటే..



సినిమా రంగంలో అందరికీ సమాన అవకాశాలు రావు. కొంతమందికి ఎంతో కష్టపడి అవకాశాలు రావాల్సి వస్తే, మరికొందరికి ఆడిషన్‌కు వెళ్లిన క్షణంలోనే అదృష్టం తలుపు తడుతుంది. ఆ 'అదృష్టవంతుల' జాబితాలో కృతి శెట్టి కూడా ఒకరు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఒక కమర్షియల్ యాడ్ ఆడిషన్ కోసం స్టూడియోకు వెళ్లిన ఆమె, ఆడిషన్ పూర్తయ్యాక తనను తీసుకెళ్లడానికి నాన్న వస్తానన్నారని చెప్పింది. కానీ ఆయనకి కొంచెం ఆలస్యం అయింది. ఆ గ్యాప్‌లో పక్కనే ఉన్న మరో స్టూడియోలోకి వెళ్లిపోయింది.

అక్కడ అప్పుడు ఒక సినిమా కోసం ఆడిషన్స్ జరుగుతున్నాయి. ఆమెను చూసిన యూనిట్ సభ్యులు.. "సినిమాల్లో నటించే ఇంట్రెస్ట్ ఉందా?" అని అడిగారు. ఏం అని చెప్పాలో తెలియక కృతి తన అమ్మ నంబర్‌ను ఇచ్చి బయటకు వచ్చేసింది. కొద్ది సేపటికి వాళ్లు ఆమె తల్లికి ఫోన్ చేసి, ఆడిషన్ కోరారు. అలా ఒక్కో మెట్టు ఎక్కుతూ చివరకు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన 'ఉప్పెన' చిత్రానికి కృతి శెట్టిని హీరోయిన్‌గా ఫైనల్ చేశారు."అన్నీ చకా చకా జరిగిపోయాయి.. నిజంగా నమ్మలేకపోయాను," అని కృతి నవ్వుతూ చెప్పింది. 'ఉప్పెన' చిత్రంతో బాక్సాఫీస్‌ను దుమ్ములేపిన కృతి శెట్టిని ఓవర్‌నైట్ స్టార్‌గా మారింది. కానీ ఆ తర్వాత ఆమెకు అనుకున్నంతగా హిట్స్ రావడం లేదు.

శ్యామ్ సింగా రాయ్ (నాని), బంగార్రాజు (నాగ చైతన్య) పర్వాలేదనిపించిన ఆ తర్వాత వచ్చిన ది వారియర్ (రామ్), మాచర్ల నియోజకవర్గం (నితిన్), కస్టడీ (చై), ఈ అమ్మాయి గురించి మీకు చెప్పాలి (సుధీర్ బాబు), మనమే (శర్వా).. ఈ చిత్రాలేవీ ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. దీంతో కృతి కెరీర్ కొంత మందగించింది. కొంత గ్యాప్ తర్వాత కృతి ప్రస్తుతం తమిళంలో రెండు ఆసక్తికరమైన ప్రాజెక్ట్సలో నటిస్తోంది. వా వాతియార్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అనే చిత్రాలు చేస్తుండగా ఇవి త్వరలోనే థియేటర్లలోకి రానున్నాయి. ఈ రెండు ప్రాజెక్ట్స్‌పై తమిళ ఇండస్ట్రీలో మంచి బజ్ ఉంది. రెంటితోనైనా కృతి మళ్లీ హిట్ ట్రాక్‌లోకి వస్తుందా అన్నది ఇప్పుడు అభిమానుల ఆసక్తికర చర్చగా మారింది.

Printed, Published and owned by ---------------------, Printed at ---------------------, H.No. 00000000, #####, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com